

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 18 మార్చి 2025

మండే కాలం!

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. జనం ఉక్కిరి బిక్కిరి
- జాగ్రత్తలు తప్పదంటున్న వైద్యులు



నెల్లూరు (వైద్యం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 10 గంటలకే తన ప్రతాపం చూపుతుండటంతో జనం ఉక్కిరిబిక్కి అవుతున్నారు. గడిచిన వారం రోజులుగా 36 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు వేడిగాలులతో అవస్థలు పడుతున్నారు. ఇక రోజువారి పనుల నిమిత్తం బయటకు వచ్చే ఉద్యోగులు, చిరువ్యాపారులు, ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత 47 డిగ్రీలకుపైగా నమోదవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

● ఈ జాగ్రత్తలు తప్పనిసరి

వేసవి తీవ్రతను తట్టుకునేలా ఉదయం 10 గంటలు లోగా, సాయంత్రం 5 గంటలకుపైగా ప్రయాణాలు పెట్టుకోవాలి. వేసవి తీవ్రతతో చెమట రూపంలో రెండు న్నర నుంచి మూడు లీటర్ల వరకు నీటిని కోల్పోయే పరిస్థితి వస్తుంది. దీనివల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఎక్కువగా ఉంది. చర్మవ్యాధులతోపాటు తలనొప్పి, ఆకలి మందగించడం, మూత్ర సంబంధిత వ్యాధులు, మతిమరుపు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అంతేగాక వడగాలులు, డీహైడ్రేషన్, వడదెబ్బ, నీటి కాలుష్యం వల్ల వచ్చే డయేరియా, వైరల్ జ్వరాలు ఇతర వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండలని ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు భానుడి తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత వాతావరణానికి అనుగుణంగా ఆహార నియమాలు పాటించాలని, నీటి సాంద్రత ఎక్కువగా ఉండే పానీయాలు, పండ్లు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

వేసవి తీవ్రత ఇలా..

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
17-3-25	26	36.01
16-3-25	25.06	36.05
15-3-25	24.06	35.0
14-3-25	24.07	36.01
13-3-25	25.05	37.01
12-3-25	25.02	35.0
11-3-25	24.09	34.07

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



మార్చిలోనే నెలలోనే ఎండ ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసకోవాలి. ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. పలుచని దుస్తులు ధరించడంతోపాటు తలపై టోపీలు పెట్టుకొని బయటకు రావాలి. అదికూడా తప్పనిసరిస్థితి అయితేనే.

- డాక్టర్ కృష్ణమూర్తి, జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్

ఎండలు తీవ్రమవుతున్నాయ్!

- ప్రజాశ్రేయస్సు దృష్ట్యా చర్యలు తీసుకోండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా వివిధ రంగాల్లో పనిచేసే కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వివిధ ఇంజనీరింగ్ శాఖలు, డ్వామా అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. కూలీలను, నిర్మాణ కార్మికులను మధ్యాహ్నంపూట పని చేయకుండా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇటుక బట్టీలు వంటి ఆరుబయట పని చేసే ప్రదేశాల్లో కార్మికుల రక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత యాజమాన్యాలను సూచించవలసిందిగా కార్మిక శాఖ అధికారిని ఆదేశించారు. హీట్ స్ట్రోక్ నివారణ కోసం చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డీఆర్వో ఉదయభాస్కర్ రావు, డ్వామా పీడీ గంగా భవానీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'కామధేను' అభివృద్ధికి చర్యలు చేపట్టండి

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఉదయగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కొండాపురం మండలం చింతలదేవిలోని కామధేను బ్రీడింగ్ సెంటర్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో కోరారు. ప్రాజెక్టు అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో వైసీపీ అధికారంలోకి రావడంతో పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ప్రధానంగా నీటి సమస్య ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. రూ.3.5 కోట్లు కేటాయిస్తే సమీప రాళ్లపాడు జలాశయం నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఇదే ప్రాజెక్టులో వెటర్నరీ కళాశాల ఏర్పాటుచేస్తే ఐదు జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఎంతో అనువుగా ఉండటంతోపాటు ప్రాజెక్టు అభివృద్ధి చెందుతుందన్నారు. స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కామధేను ప్రాజెక్టు పరిస్థితిని తెలుసుకునేందుకు ఓ పరిశీలన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. తాను స్వయంగా ప్రాజెక్టును సందర్శించి అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు.



సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేయాలి

- కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి



కావలి, (ఆంధ్రజ్యోతి): మన బిడ్డల ఆదాయం మనకే దక్కేలా ప్రతి జిల్లాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేయాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కోరారు. ఇక్కడ వనరులు సరిగాలేక ఇతర రాష్ట్రాలకు వెళ్లి మన బిడ్డలు ఉద్యోగాలు చేస్తున్నారని, వారి వల్ల పన్నుల రూపంలో వచ్చే ఆదాయం అయా రాష్ట్రాలకు పోతుందన్నారు. ప్రతి జిల్లాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేస్తే మన బిడ్డల ఆదాయం మనకే దక్కుతోందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా అనర్హులకు మాత్రం సంక్షేమ పథకాలు దక్కుతున్నాయన్నారు. వ్యక్తి పూర్తి వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తే మేలు జరుగుతోందన్నారు.

బీపీటీకి మద్దతు దక్కేలా చూడండి

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో బీపీటీ రకం ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. జిల్లాలో రైతులు బీపీటీ, కేఎన్ ఎం, ఆర్ఎన్ఆర్ రకాలను సాగు చేశారన్నారు. కేఎన్ఎం, బీపీటీ రకాలు పండించిన రైతులకు మాత్రం మద్దతు ధర లభించడం లేదన్నారు. మద్దతు ధర పుట్టికి రూ.19700 ఉండగా, బీపీటీ ధాన్యాన్ని రూ.16వేలు, రూ.17వేలకే అమ్ముకోవాల్సి వస్తున్నదన్నారు. సుమారు 1.5 లక్షల ఎకరాల్లో ఈ రకాలు సాగు చేశారన్నారు. రైతులకు మద్దతు ధర దక్కేలా వ్యవసాయ, సివిల్ సప్లయిస్ శాఖల మంత్రులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మెట్టలో విభిన్నం!

- ఉదయం 8 వరకు కూడా వీడని మంచు



ఉదయగిరి పట్టణంలో కురుస్తున్న పొగమంచు



సీతారామపురం : ఉదయం 8 గంటలకు కూడా లైట్ల వెలుగులో వాహన రాకపోకలు

జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటి ఉష్ణోగ్రతలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా, ఉదయం 8 గంటల వరకు పొగమంచు కురుస్తోంది. మెట్టప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొంది. సోమవారం ఉదయం 8 గంటల వరకు ఉదయగిరి పట్టణంలో చిరుజల్లుల్లా మంచు కురుస్తూనే ఉంది. 1670-బీజీ రహదారి, ఉదయగిరి ట్యాంక్‌బండ్‌పై వాహనదారులు లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ మంచు కారణంగా పండ్లతోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మామిడి చెట్లలో పూత రాలిపోయి దిగుబడి పడిపోతుందని ఆవేదన చెందుతున్నారు. సీతారామపురం మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

- ఉదయగిరి/సీతారామపురం, (ఆంధ్రజ్యోతి)

నీటి కొరత.. ఉక్కపోత!

- తొలిరోజే 'పది' విద్యార్థులకు అగ్ని పరీక్ష

పదో తరగతి పరీక్షల్లో తొలిరోజే విద్యార్థులు అగ్ని పరీక్షను ఎదుర్కొన్నారు. సోమవారం ప్రారంభమైన పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా అత్యధిక కేంద్రాల్లో మంచినీటి వసతులు లేకపోవడం, ఉన్న వాటర్ ప్లాంట్లన్నీ మూలనపడటంతో విద్యార్థులకు నీరు అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తగా ఇంకొన్ని సెంటర్లలో వెలుతురు సరిగా లేక చీకట్లోనే పరీక్ష రాయాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన చెందారు. మరోవైపు అడుగడుగునా ట్రాఫిక్ సమస్యలు ఎదురవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. మొత్తమ్మీద జిల్లాలో తొలిరోజు టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.



సీతారామపురం : విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (విద్య), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలోని 174 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు వరకు టెన్త్ పరీక్షలు జరిగాయి. తొలిరోజు సోమవారం రెగ్యులర్ 28,496, ప్రైవేట్ 734 మంది మొత్తం 29,230 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా రెగ్యులర్ 28,492 మంది, ప్రైవేట్ 354 మంది కలిపి 28,846 మంది హాజరయ్యారు. 384 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష సమయానికంటే 45 నిమిషాలు ముందుగా కేంద్రానికి హాజరు కావాలని అధికారులు సూచించినా కొన్ని ప్రాంతాల్లో రవాణా, ట్రాఫిక్ సమస్యల కారణంగా కొంతమంది విద్యార్థులు కొంత ఆలస్యంగా హాజరైనా అధికారులు అనుమతించారు. అత్యధిక శాతం మంది విద్యార్థులు ఉదయం 8 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు తమ హాల్‌టికెట్లను, తమకు కేటాయించిన గదులను బోర్డులలో పరిశీలించుకుంటూ హడావుడిగా కనిపించారు. కొంతమంది తల్లిదండ్రులు అల్పాహారాన్ని నేరుగా కేంద్రాల వద్దకే తీసుకుని వచ్చి పిల్లలకు పెడుతూ జాగ్రత్తలు చెబుతూ కనిపించారు.



కావలిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

● కేంద్రాల పరిశీలన

పదోతరగతి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. కలెక్టర్ ఓ.ఆనంద్ నగరంలోని ఈఎస్ఆర్ఎం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే అబ్జర్వర్ 7 కేంద్రాలను, డీఈఓ బాలాజీరావు 9 కేంద్రాలను, ఫ్లయింగ్‌స్క్వాడ్ 67 కేంద్రాలను పరిశీలించారు. అలాగే ఓపెన్ టెన్త్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన హిందీ పరీక్షకు 9 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరు అయ్యారు.

● వసతులు లేక ఇబ్బందులు

జిల్లాలోని పలు కేంద్రాల్లో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వసతుల కల్పనలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ఫ్యాన్లు కూడా లేని గదుల్లో పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేస్తున్న పనులు అసంపూరిగా నిలిపివేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. మరోవైపు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయకపోవడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా కేంద్రాల వద్ద విద్యార్థుల హాల్‌టికెట్ల నెంబర్లు, గదుల కేటాయింపులకు సంబంధించిన డిస్‌ప్లే లేకపోవడంతో కంగారు పడ్డారు. అలాగే విద్యార్థులంతా రోడ్లపైకి రావడం, కిక్కిరిసిన వాహనాలతో ట్రాఫిక్ పెరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించాలని కోరుతున్నారు.

వాచ్‌మన్ చేతిలో ఫోన్

కందుకూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద వాచ్‌మన్ సెల్‌ఫోన్ పట్టుకొని తిరుగుతుండటంతో తల్లిదండ్రులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాచ్‌మన్ గేటు వద్ద ఉండాల్సిందిపోయి పరీక్ష మొదలు జవాబు పత్రాల బండిళ్ల పోస్టాఫీసుకు తీసుకెళ్లే వరకు సెల్‌ఫోన్ చేతపట్టుకుని చక్కర్లు కొట్టారు. ఇది గమనించిన తల్లిదండ్రులు హెచ్ఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంతో జవాబు పత్రాలు గంట ఆలస్యంగా పోస్టాఫీసుకు చేరాయి. ఈ వ్యవహారంపై హెచ్ఎం రవి మాట్లాడుతూ రికార్డు అసిస్టెంట్ మూగ, చెవిటి అంగవైకల్యం కలిగిన వ్యక్తి కావడంతో ఆయనకు సహాయకారిగా వాచ్‌మన్ గోవింద్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అంతేతప్ప విధులకు ఆటంకం కలిగించే పనులు చేపట్టలేదని తెలిపారు.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

పిల్లలతో ఆటలా!?

20 నిమిషాలు ఆలస్యంగా గురుకుల విద్యార్థులు

టెన్త్ పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని విద్యా శాఖ అధికారులు పదేపదే హెచ్చరికలు జారీ చేసినా ఆ గురుకుల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆలస్యంగా పిల్లలను పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లడంతో అధికారులు అనుమతించలేదు. చివరకు టీడీపీ నేతల జోక్యంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ 9.20 గంటలకు చెన్నపల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే, వీరిని అధికారులు అనుమతించకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు ఉన్నత అధికారులతో ఫోన్ మాట్లాడారు. స్కూలు హెచ్ఎం సాయిప్రసాద్‌తో మాట్లాడి గురుకుల విద్యార్థులు 79 మంది పరీక్షకు హాజరయ్యేలా చర్యలు చేపట్టడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ వ్యవహారంపై గురుకుల జిల్లా కో ఆర్డినేటర్ విచారణ చేపట్టారు. కాగా, ఇందుకు బాధ్యురాలిగా పీఈటీ మౌనికను సస్పెండ్ చేస్తున్నట్లు డీసీవో పద్మజ పేర్కొన్నారు.

- టీపీ గూడూరు, (ఆంధ్రజ్యోతి)

ప్రతి ధాన్యపు గింజ కొనేలా చూడాలి

- టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో తీర్మానం

నెల్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ప్రతి గింజ కొనుగోలు చేసేలా చూడాలని జిల్లా టీడీపీ సమన్వయ కమిటీ తీర్మానించింది. సోమవారం రాత్రి అమరావతిలోని సోమిరెడ్డి నివాసంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలపై లోతుగా చర్చించారు. రైతులకు ఎక్కడా సమస్యలు ఎదురుకాకుండా చూడాలని, జిల్లాలో ప్రతి గింజను కొనుగోలు చేసేలా చూడాలని నిర్ణయించారు. జిల్లాలో ఎంత దిగుబడి రావచ్చో... అంచనా వేసి తదనుగుణంగా కొనుగోలు సామర్థ్యం పెంచడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. దళారుల పరిస్థితి పునరావృతం కాకుండా ఎమ్మెల్యేలు నిఘా ఉంచాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. జిల్లా పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ వేగవంతం చేయాలని, మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి,పాశం సునీల్ కుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీటీడీ పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు చైర్మన్ కృష్ణయ్య, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికైన బీద రవిచంద్రకు జిల్లా పార్టీ తరపున అభినందనపూర్వక విందు ఏర్పాటు చేశారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, నారాయణ, జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు

మహిళా విద్యకు మణి మకుటం



ఆడవాళ్లు వంటింటికే పరిమితం అని భావించే రోజుల్లోనే అతివల ఉన్నత విద్య కోసమే పురుడు పోసుకున్న విద్యాలయం. ఒకరా... ఇద్దరా.. లక్షలాది మంది అమ్మాయిలను విద్యాధికులుగా తీర్చిదిద్దిన సరస్వతీ నిలయం. 60 ఏళ్ల ఘనమైన చరిత్ర. కాలానుగుణంగా ఆధునిక వసతులు.. అత్యాధునిక కోర్సులు. జిల్లాకు చెందిన వారే కాదు పక్క జిల్లాల నుంచి కూడా వచ్చి చదువుకునేంత నమ్మకమైన బోధనా కేంద్రం. పక్క రాష్ట్రాల్లోనూ ప్రత్యేక గుర్తింపు కలిగిన కాలేజీ. అదే నెల్లూరు నగరంలోని దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల. స్వయం ప్రతిపత్తి హోదా కలిగి రెండు వేలమందికిపైగా విద్యార్థినులకు విద్యా బోధనేకాదు ఉపాధి మార్గాలూ చూపుతున్న ఆ కళాశాల వజ్రోత్సవ సంరంభానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- ఆదర్శవంతంగా డీకేడబ్ల్యూ కళాశాల
- ఆరు దశాబ్దాల ఘన చరిత్ర
- రాష్ట్రంలోనే ఉత్తమ విద్యాసంస్థగా గుర్తింపు
- ఇక్కడి నుంచే ఎందరో ఉన్నత శిఖరాలకు..

నెల్లూరు(విద్య), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నెల్లూరు నగరంలోనే కాకుండా రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి కలిగిన విద్యాసంస్థగా కీర్తి గడిస్తోంది. నెల్లూరుకు చెందిన వదాన్యులు దొడ్ల సుబ్బారెడ్డి-కౌసల్యమ్మ దంపతులు దూర దృష్టితో మహిళల కోసంగా ప్రత్యేకంగా కళాశాల ఉండాలన్న ఉన్నతాశయంతో 1964-65 మధ్యకాలంలో 24.59 ఎకరాలు వితరణ చేశారు. అంతేకాక అప్పట్లోనే దొడ్ల సుబ్బారెడ్డి రూ.3లక్షల ఆర్థిక సాయం అందించడంతో ఈ స్థలంలో కౌసల్యమ్మ పేరుమీద కళాశాల భవనాలు నిర్మించారు. 1966 సెప్టెంబరు 28న నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాలను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నో మార్పులు, నూతన హంగులతో ప్రస్తుతం మొత్తం 94 గదులు, ఒక అసెంబ్లీ హాల్, 17 ల్యాబ్‌లు, 40 వేల పుస్తకాలతో లైబ్రరీ, రెండు కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంగ్లీష్ ల్యాబ్, 600 మందికిపైగా విద్యార్థినులు ఉండేందుకు హాస్టల్ భవనాలు ఏర్పాటయ్యాయి. ఎప్పటికప్పుడు అవసర మైన కొత్త నిర్మాణాలు, వసతులు కల్పించడంతోపాటు కాలానుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెడుతుండడంతో ఏడాదికేడాదికి ఈ కళాశాలలో విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

రేపటి నుంచి వజ్రోత్సవాలు

డీకే కళాశాల 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 19, 20 తేదీల్లో వజ్రోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీ గిరి తెలిపారు. ప్రస్తుత జిల్లాలో ఏకైక మహిళా కళాశాలగా కీర్తి గడించిన విద్యాసంస్థ వజ్రోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని, ఇందులో పూర్వ విద్యార్థినులు, పూర్వ అధ్యాపకులు, కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, ప్రముఖులతోపాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నత విద్యామండలి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు.

● ప్రైవేట్ ఉధృతిలోనూ ఉనికి..

జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టకొస్తున్నా డీకే ప్రభుత్వ మహిళా కళాశాల మాత్రం తన ప్రత్యేకతతో ఉనికిని చాటుకుంటోంది. తొలుత ఇంటర్మీడియట్ (నాటి పీయూసీ), డిగ్రీ కోర్సులను అందించే మిశ్రమ సంస్థగా ప్రారంభమైన ఈ కళాశాలను విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో 1996లో ఇంటర్ కళాశాల, డిగ్రీ కళాశాలలుగా విభజించారు. ఆ తర్వాత పీజీ కోర్సులను కూడా ప్రవేశ పెట్టారు. ప్రస్తుతం రెండు వేల మందికిపైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఈ కాలేజీలో ఇంటర్, డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉండగా డిగ్రీలోనే 1100 మందికిపైగా విద్యార్థినులు 12 రకాల కోర్సులను అభ్యసిస్తున్నారు. కేవలం రెగ్యులర్ కోర్సులే కాక డిప్లమో కోర్సులు, ఉపాధి కోర్సులను ఇక్కడ అందిస్తున్నారు. 62 మంది అధ్యాపకులు పనిచేస్తుండగా వారిలో దాదాపు 70 శాతం మంది పీహెచ్‌డీ చేసినవారు కావడం గమనార్హం. అలాగే విద్యార్థినుల కోసం జవహర్ నాలెడ్జ్ సెంటర్, డిస్ట్రిక్ట్ రీసోర్స్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్ ఉన్నాయి. ఈ కళాశాలలో చదువుకున్న ఎంతో మంది వైద్యులు, న్యాయవాదులు, అధ్యాపకులు, ఉన్నతాధికారులుగా రాణిస్తున్నారు.

● స్వయం ప్రతిపత్తి, నాక్, యూజీసీ గుర్తింపు

నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందిస్తుండడంతో డీకే కళాశాల నాక్, యూజీసీ ఏ, బీ గుర్తింపు పొందింది. స్వయం ప్రతిపత్తి హోదా దక్కించుకుంది. 2017లో యూజీసీ నుంచి సీపీఈ హోదా లభించడంతో 1.5 కోట్ల నిధులు కళాశాలకు విడుదల చేశారు. అలాగే రూసా పథకం కింద విడుదలైన రూ.2కోట్ల నిధులతో బ్రాడ్‌బ్యాండ్ సేవలు, ఉచిత వైఫై సౌకర్యాలతోపాటు కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వీటితోపాటు 1974 నుంచే కళాశాలలో ఉన్న జాతీయ విద్యార్థి సేవ యూనిట్ విశేష సేవలందిస్తోంది. ఇంటర్, డిగ్రీల్లో ప్రస్తుతం వంద మంది విద్యార్థినుల చొప్పున మూడు యూనిట్లు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి. ఎన్‌సీసీ విభాగం, దూరవిద్య కోసం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ కూడా అందుబాటులో ఉన్నాయి.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

మర్రిపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దార్ అనీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలో తాగు, సాగు నీరు వంటి సమస్యలతో పాటు ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన సూపర్ 6పథకాలను అమలు చేయాలని సీపీఎం నాయకుడు మూలి వెంగయ్య డిమాండ్ చేశారు. కార్య క్రమంలో రంతుల్లా, రత్నయ్య పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8440
వెండి కిలో ధర	రూ. 1031.00
వెండి ఒక గ్రాము	రూ.106.10

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

● ట్రాన్స్‌కో ఏఈ మన్మథరావు



సంగం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగ దారులకు విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ మన్మథరావు తెలిపారు.

? అదనపు లోడు అంటే ఏమిటీ, డెవలప్‌మెంట్ చార్జీలు ఎంత, ఇప్పుడు ఎంత రాయితీ ఇస్తున్నారు.

! వినియోగదారులు గత అవసరం మేరకు సర్వీస్ తీసుకునే సమయంలో ఒక కిలో వాట్‌కు తీసుకుని ఉండ వచ్చు. క్రమేణా విద్యుత్ వినియోగం పెరిగి ఒక కిలోవాట్ కంటే ఎక్కువ వినియోగిస్తుంటే అదనపు లోడు అంటారు.

? 50 శాతం రాయితీ అంటే ఎంత.

! గతంలో ఒక కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ. 2 వేలు. ప్రస్తుతం వినియోగదారుడు స్వయంగా క్రమబద్ధీకరించుకుంటే కిలోవాట్‌కు రూ.1000 చెల్లిస్తే సరిపోతుంది. లేకపోతే విద్యుత్ అధికారులు తనిఖీ సమయంలో అదనపు లోడు వినియోగిస్తున్నట్లు తెలిస్తే పూర్తి మొత్తంతో పాటు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

? క్రమబద్ధీకరణ ఎలా చేసుకోవాలి.

! వినియోగదారుడు గూగుల్‌లో ఏపీఎస్ పీడీసీఎల్ వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే వాలంటరీ అడిషనల్ లోడ్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి అదనపు లోడ్‌ను కిలోవాట్‌కు రూ. 1000 చొప్పున ఎన్ని కిలోవాట్‌లు కావాలంటే అన్ని కిలోవాట్‌లకు చెల్లించవచ్చు.

? క్రమబద్ధీకరణకు ఎప్పటివరకు అవకాశం ఉంది.

! వినియోగదారుడు స్వయంగా క్రమబద్ధీకరణకు మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. అప్పటి లోగా క్రమబద్ధీకరించుకోవచ్చు.

న్యూస్ బాక్స్


మహిళల భద్రతకు శక్తి యాప్ : ఎస్పీ



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, బాలికల భద్రతలకు శక్తి యాప్ ఓ రక్షణ కవచమని ఎస్పీ జి కృష్ణకాంత్ తెలిపారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో శక్తి యాప్ కరపత్రాలను ఎస్పీ ఆవిష్కరించి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్‌ను ప్రతి మహిళ తమ మొబైళ్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. విపత్కర పరిస్థితుల్లో ఆ యాప్‌లో వివరాలు నమోదు చేస్తే పోలీసులు వెనువెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటాని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ యాప్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించి, వారి మొబైళ్లలో డౌన్‌లోడ్ చేయించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమాజంలో వివిధ రకాల నేరాలు జరిగినప్పుడు వెంటనే శక్తి యాప్‌తోపాటు 100, 112, 1972, 1098 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కావలి డీఎస్పీలు పి సింధుప్రియ, శ్రీధర్, పాల్గొన్నారు.

అదనపు సాయంపై లబ్ధిదారులకు అవగాహన



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఏఈ గౌస్ మొహిద్దీన్

సంగం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయంపై హౌసింగ్ ఏఈ గౌస్ మొహిద్దీన్ సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టి అర్ధాంతరంగా ఆగిన ఇళ్ల లబ్ధిదారులకు వాటిని పూర్తిచేసేందుకు ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మే నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధి ఉద్యోగుల్లో ఉత్కంఠ

నేడు సామాజిక తనిఖీ బహిరంగ చర్చా వేదిక

ఉదయగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వలసల నివారణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా దోచుకున్నారనే విమర్శలు బహిరంగా వినిపిస్తున్నాయి. అందులో భాగంగా ఉదయగిరి మండలంలోని 17 పంచాయతీల్లో 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు ఉపాధి హామీ పథకం కింద రూ.11 కోట్లు, పంచాయతీరాజ్ రూ.96 లక్షలు, ఇరిగేషన్ రూ.1.94 కోట్లు పనులు జరిగాయి. వీటికి సంబంధించి జరిగిన పనులను గత కొన్ని రోజులుగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బహిరంగ చర్చావేదిక నిర్వహిస్తుండడంతో అవినీతికి పాల్పడిన ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది.



రికార్డులను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం(ఫైల్)

ఉద్యోగుల్లో వణుకు

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం బహిరంగ చర్చావేదిక నిర్వహిస్తుండడంతో ఉద్యోగుల్లో వణుకు మొదలైంది. పలు పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు తమకు అనకూలమైన వారి పేర్లతో దోపిడీకి పాల్పడడంతోపాటు వలస వెళ్లినవారి పేర్లతో బినామీ మస్టర్లు వేసి భారీగా నిధులు స్వాహా చేశారని సామాజిక తనిఖీ బృందం తనిఖీల్లో వెలుగుచూసింది. ప్రతి పంచాయతీలో భారీగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఈ విషయాలను తనిఖీ బృందం చర్చావేదికలో వెల్లడించనుండడంతో ఉద్యోగుల్లో వణుకు మొదలైంది. ఇటీవల జిల్లాలోని కావలి, కలువాయి, సీతారామపురం మండలాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ చర్చా వేదికలో రూ.లక్షల్లో అవినీతికి పాల్పడినట్లు అధికారులు నిర్ధయించారు. అందులో భాగంగా ఏపీవోలు, టీఏలు, ఎఫ్ఏలను భారీసంఖ్యలో సస్పెండ్ చేయడంతోపాటు అవినీతికి పాల్పడిన సొమ్ము రికవరీ చేయాలని ఆదేశించారు. మంగళవారం జరగనున్న చర్చావేదికలో సైతం ఉద్యోగులు సస్పెండ్‌కు గురికాక తప్పదని పలువురు బహిరంగంగా పేర్కొంటున్నారు.

ఉపాధి హామీ పనుల్లో బినామీ మస్టర్లు

● సామాజిక తనిఖీ గ్రామసభలో వెల్లడి

ఉదయగిరి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచు గొల్లపల్లి కల్పన అధ్యక్షతన సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ బొమ్మప్ప ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి గ్రామంలో చేపట్టిన విచారణ నివేదికలను చదివి వినిపించారు. స్థానికంగా నివాసాలు లేని ఇద్దరి పేర్లతో బినామీ మస్టర్లు వేసి రూ. 47,027 నగదు చెల్లించినట్లు నిర్ధారించారు. అలాగే రూ. 18.97 లక్షల పనులకు సంబంధించి ఎలాంటి మస్టర్లు, ఎం.బుక్కులు, పేఆర్డర్లు అప్పగించకపోగా పని ప్రదేశాల్లో సమాచార బోర్డులు ఏర్పాటు చేయకుండా రూ. 14,400 నగదు జమ చేసుకోవడం జరిగిందన్నారు. కొలతలను కూడా అదనంగా చూపించి నగదు చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. పని ప్రదేశాల్లోనూ ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకుండా పూర్తిస్థాయిలో రికార్డులను కూడా తమకు అందించలేదని నివేదించారు. దీంతో అక్కడే ఉన్న కూలీలు విస్తుపోయి సభ పూర్తవకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ బుజ్జీ, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డీఆర్పీ బొమ్మప్ప

కొత్త గ్రూపు ఏర్పాటు చేయాలి

కొండాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమను కొత్త గ్రూపుగా ఏర్పాటు చేయాలని మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారి పాలెంకు చెందిన ఉపాధి కూలీలు ఎంపీడీవో ఆదినారాయణను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనకు వినతిపత్రం అందచేశారు. గ్రామానికి చెందిన దామా మల్లికార్జున, కాండ్ర శ్రీహరి తదితరులు మాట్లాడుతూ సుమారు 45 మందిని ఒక గ్రూపుగా ఏర్పాటు చేయాలని ఇటీవల అధికారులకు అర్జీ అందజేశామన్నారు. తమకు ఎటువంటి సమాచారం అందించ కుండా వేరే గ్రూపులో చేర్చారన్నారు. ముందు సూచించిన విధంగా 45 మంది కూలీలతో ఒక గ్రూపును ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుం టామని ఎంపీడీవో పేర్కొన్నారు.

పంట కాలువలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై
రైతుల ఆందోళన



వీరారెడ్డిపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

ఉదయగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో పంట కాలువలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో భాగంగా ఉదయగిరి పెద్ద చెరువు నుంచి సాగునీరు సరఫరా చేసే పంట కాలువలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ పంట కాలువ కింద 60 ఎకరాలు సాగులో ఉందన్నారు. స్తంభాల ఏర్పాటుతో సాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని రైతులు వాపోయారు. స్తంభాలు ఏర్పాటుచేయవద్దని సంబంధిత అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్తంభాలను మరోచోట ఏర్పాటు చేయాలని వారు కోరారు.

పసుపు, వరి దిగుబడులకు మద్దతు ధర కల్పించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉదయగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పసుపు, వరి పంటలకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పలువురు రైతులు తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటలకు తీరా దిగుబడి చేతికందిన సమయంలో ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఆయా పంటల ధరలు క్షీణించడంతో రైతులకు పెట్టుబడులు కూడా రావన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం క్వింటా ధాన్యంకు రూ. 2,700, పసుపుకు రూ.17వేల చొప్పున మద్దతు ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం లోని గంగులవారిచెరువుపల్లి చెరువు కింద సాగులో పంటలకు నీరు విడుదల చేయాలని సోమవారం రైతు మధుసూదన్ తహసీల్దారు సుభద్ర, జలవనరుల శాఖ ఏఈ వేణులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో చేపల పెంపకం చేపట్టి పంటలకు నీటి విడుదలను కొందరు అడ్డుకుంటున్నారన్నారు. దీంతో పంటలు ఎండు దశకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయన కోరారు.

ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

● విధులకు 480 మంది హాజరు



స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రంలో మాట్లాడుతున్న ఆర్ఐవో

నెల్లూరు(విద్య), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల మొదటి విడత మూల్యాంకనం సోమవారం నగరంలోని స్టౌన్‌హౌస్‌పేట కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. ఈనెల 7 నుంచి జరుగుతున్న సంస్కృత మూల్యాంకనంతోపాటు ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్ సివిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనాన్ని ప్రారంభించారు. ఇందుకుగాను 480 మంది అధ్యాపకులను నియమించారు. ఏప్రిల్ మొదటి వారానికి మూల్యాకనం పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 22 నుంచి మిగిలిన సబ్జెక్ట్‌ల మూల్యాంకనం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. మూల్యాంకనానికి హాజరు కాని అధ్యాపకులు వెంటనే మూల్యాంకన కేంద్రంలో రిపోర్ట్ చేయాలని, సంబంధిత అధ్యాపకులను వెంటనే రిలీవ్ చేసి విధులకు హాజరయ్యేలా చూడాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. అధ్యాపకులు గైర్హాజరైతే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా మూల్యాంకనానికి హాజరైన అధ్యాపకులకు విధుల నిర్వహణ, త్వరతగతిన పూర్తి చేయాల్సిన అంశాలపై ఆర్ఐవో సూచనిచ్చారు. కాగా సోమవారం జిల్లాలోని 14 కేంద్రాల్లో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్, మైనర్ సబ్జెక్ట్‌ల పరీక్షలకు 663 మంది హాజరు కావాల్సి ఉండగా 560 మంది హాజరయ్యారు. 103 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు : జేసీ



విలేకరులతో జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జేసీ కే. కార్తీక్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఒక్కరోజే జిల్లాలో 2500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ఎవరైనా రైతులను ప్రలోభపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తే, వారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ధాన్యం సేకరణ ఎక్కువగా ఉన్న కేంద్రాల్లో గన్నీ బ్యాగులను ముందుగా సిద్ధం చేసి ఉంచు తున్నట్లు చెప్పారు. వాహనాలకు పర్మినెంట్ జీపీఎస్ కాకుండా టెంపరరీ మాగ్నటిక్ జీపీఎస్‌ను ఏర్పాటు చేసేందుకు ఏజెన్సీని ఎంపిక చేసినట్లు చెప్పారు. దీంతో వాహనాల సమస్య పరిష్కారమవుతుందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ నెంబరు 8520879929ను ఏర్పాటు చేసినట్లు జేసీ వివరించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి అంకయ్య జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ అర్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

● 11 సవర్ల బంగారం, రూ. లక్ష నగదు అపహరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వింజమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంది గుంట గ్రామంలో వీవీ ఆర్ నగర్‌లో సోమ వారం ఉదయం ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఇంటి యాజమాని షేక్ ఖాదర్‌బాషా, బీబీజాన్ ఇద్దరూ పనిమీద బయటికి వెళ్లారు. ఇది తెలుసుకున్న దొంగలు కిటికీ గ్రిల్స్ కట్ చేసి ఇంట్లోకి వెళ్లి బీరువాలోని లాకర్‌లో 11 సవర్ల బంగారం, రూ.లక్ష నగదు దొంగిలించారు. దీంతో బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ వీరప్రతాప్, చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

● గ్రామస్థుల అవస్థలు



కంపతుమ్మ చెట్లతో మూసుకుపోయిన సిద్దీపురం- అనసూయనగర్ రహదారి

సంగం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల అనుసంధానం రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని సిద్దీపురం నుంచి మజరా గ్రామం అనసూయనగర్‌కు, తరుణవాయి నుంచి ఉడ్‌హౌస్‌పేటకు, అదేవిధంగా జంగాలదొరువు నుంచి గొల్లపాళెం, జంగాల దొరువు నుంచి అక్బరాబాద్, జెండాదిబ్బ నుంచి అరవపాళెం, పుట్టవారిగుంట, అన్నారెడ్డిపాళెం నుంచి పల్లిపాళెంకు అనుసంధాన రహదారులున్నాయి. ఈ రహదారులన్నీ ముళ్ల పొదలు మొలచి కుచించుకొనిపోయి అధ్వానంగా తయారయ్యాయి. ఈ రహదారుల్లో రాత్రి 7గంటలు దాటితే ప్రయాణం చేయాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల రహదారుల గురించి పట్టించుకోకపోవడంతో దారి పొడవునా ముళ్ల పొదలు, గుంతలమయంగా మారాయి. రాత్రివేళ అత్యవసరమైనప్పుడు రాకపోకలు సాగించాలంటే తిప్పలు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామీణ లింకు రోడ్లను జాతీయ గ్రామీణాభివృద్ధి పథకంలో అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రహదారిపై కాలువలు తవ్వకుండా చూడాలి

● అధికారులకు వాహనదారుల వినతి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొంతమంది స్వార్థపరుల కారణంగా రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. గువ్వాడి, కాంచెరువు, తోటలచెరువుపల్లి తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారులను కొంతమంది తమ స్వంత అవసరాల కోసం ఇష్టానుసారంగా తవ్వి కాలువలు తీస్తున్నారు. తాగు, సాగు నీటి సరఫరా కోసం పైపులు, ఇతరత్రా పనులను సాకుగా చూపి రహదారి పొడవునా తీసిన గుంతలను తిరిగి పూడ్చకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో అటుగా ప్రయాణాలు సాగించే వాహనదారులు అవి కనిపించక పోవడంతో అదుపుతప్పి బోల్తాపడి ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

మిద్దెపై పడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొరడా వీధిలో సోమవారం తెల్లవారుజామున ఓ యువకుడు పక్కనున్న మిద్దెపై పడి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు, పశ్చిమబంగాల్‌కి చెందిన సుబ్రత సమంత పదేళ్ల కిందట ఉపాధి కోసం నగరానికి వచ్చారు. కోటమిట్టకు చెందిన అన్వర్‌బాషా వద్ద బంగారు పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని చిన్నాన కుమారుడు సునీల్ సమంత(27) కూడా ఎనిమిదేళ్ల కిందట నెల్లూరుకి వచ్చాడు. కొరడా వీధిలోని మొహిద్దీన్ వద్ద బంగారు పని చేసుకుంటూ సమీపంలోని సురేంద్ర కాంప్లెక్స్‌లోని నాలుగోఅంతస్తులోని పెంట్‌హౌస్‌లో స్నేహితులు జయంత్‌దొట్టె, జయంత్‌గైన్‌తో కలిసి ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి వరకు ముగ్గురూ పూటుగా మద్యం సేవించారు జయంత్‌లు ఇద్దరూ భోజనం చేసేందుకు లోపలికి వెళ్లారు. సునీల్ సమంత మాత్రం బయటే ఉన్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ, పక్కనే ఉన్న మిద్దెపై సునీల్ సమంత పడ్డాడు. గట్టిగా శబ్దం రావడంతో బయటకు పరుగులు తీసిన స్నేహితులు విషయాన్ని దస్తగిరి ద్వారా సుబ్రత సమంతకు తెలియజేశారు. ఆయన అక్కడికి చేరుకొని 108కి సమాచారం అందించారు. 108సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి అన్న సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుల్తాన్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేశారు. ప్రభుత్వ వైద్యులు సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

పూటుగా మద్యం సేవించి వ్యక్తి..



మృతి చెందిన రాఘవరెడ్డి

కలిగిరి, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి): పూటుగా మద్యం సేవించిన మేడం రాఘవరెడ్డి(58) కలిగిరి-వింజమూరు రహదారిలో సోమవారం మృతి చెందాడు. వివరాల మేరకు.. కలిగిరికి చెందిన రాఘవరెడ్డి 20 ఏళ్ల క్రితం భార్య, కుమార్తెతో విభేదించి కలిగిరి నుంచి నెల్లూరుకు వెళ్లి ఓ కార్ల షోరూం వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కలిగిరి చేరుకున్నాడు. మద్యం సేవించి బంధువుల ఇళ్ల వద్దకు వెళ్లగా వారు పంపించి వేశారు. సోమవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో వింజమూరుమార్గంలో సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన మృతి చెందిఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించి పూటుగా మద్యం సేవించి గొంతెండి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి జేబులో సెల్‌ఫోన్ ఆధారంగా స్థానిక బంధువులకు సమాచారమిచ్చి స్థానికులకు మృతదేహాన్ని అప్పగించామని ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో వృద్ధురాలిపై యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. 84ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధురాలు నివాసంలో ఒంటరిగా నిద్రిస్తుండగా గమనించిన యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో అతను పరారయ్యాడు. సోమవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘునాథ్ తెలిపారు.

బీరు సీసాతో యువకుడిపై దాడి

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి):నగరంలోని డైకస్‌రోడ్డులో ఇద్దరు యువకులు మరో యువకుడిపై సోమవారం బీరు సీసాతో దాడి చేశారు. సేకరించిన సమాచారం మేరకు, నగరంలోని వెంగళరావునగర్‌కు చెందిన షారూర్(22) సోమవారం డైకాస్‌రోడ్డుకు వెళ్లాడు. అక్కడున్న మద్యం దుకాణం మీదుగా వెళుతుండగా ఆటోలో మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకులు కనిపిస్తే పలకరించవా రా... అంటూ బీరు సీసాతో అతడిపై దాడిచేశారు. గాయాలపాలైన షారూక్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. దాడిచేసిన వ్యక్తులు అదే ప్రాంతానికి చెందినవారని తెలుస్తుంది. వివరాలు తెలియాల్సి ఉంది.

తెల్లరాయి తరలిస్తున్న లారీల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న తెల్లరాయి లారీలు

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లోని 565జాతీయ రహదారిపై తెల్లరాయి తరలిస్తున్న రెండు లారీలను సోమవారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరికుంటపాడు మండలం వేంపాడు నుంచి చెన్నైలోని వేలూరుకు ఈ తెల్లరాయి తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్ఐ ఆదిలక్ష్మీని వివరణ కోరగా అధిక లోడుతో తెల్లరాయిని తరలిస్తుండడంతో వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు వాటిని మైనింగ్ శాఖాధికారులకు అప్పగించినట్లు ఆమె తెలిపారు.

ఏఆర్ ఏఎస్పీ వీఆర్‌కి బదిలీ

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ ఏఎస్పీ జీ. మునిరాజను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది అక్టోబరులో మునిరాజా బాధ్యతలు చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యం, వివిధ ఆరోపణల నేపధ్యంలో ఆయన్ను వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యి పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని గేదెల మృతి

ఉదయగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):కుర్రపల్లి బీసీ కాలనీ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై ఎస్ఎల్‌సీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని ఐదు గేదెలు, మూడు దూడలు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సీతారామపురం నుంచి హైదరాబాదుకు వెళుతున్న బస్సు అతివేగంగా వస్తూ కుర్రపల్లి బీసీ కాలనీ సమీపంలో రోడ్డు దాటుతున్న గేదెలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదు గేదెలు, మూడు దూడలు మృతిచెందాయి. బస్సు గేదెలను ఢీకొట్టి సుమారు 50 మీటర్ల మేర లాక్కొని వెళ్లడంతో రోడ్డుపై గేదల మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. మృతిచెందిన గేదెలు సీతారామపురం మండలం సంజీవరెడ్డినగర్‌కు చెందినవిగా గుర్తించారు. గేదెల మృతితో సుమారు రూ5 లక్షలు నష్టం వాటిల్లినట్లు పాడి రైతులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రహదారిపై గేదెల కళేబరాలు

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	218

కోడిగుడ్ల ధర (100): 510

విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట నేడు నిరసన

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి ఉపాధి లేకుండా చేస్తుందని రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు మంగళవారం డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలపనున్నారు. దీనిలో భాగంగా సోమవారం స్థానిక కోటారెడ్డి భవనంలో ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు సమావేశమయ్యారు. మీటర్ రీడర్స్‌గా ఇంతకాలం సేవ చేసిన మాకు సంబంధిత విద్యుత్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధి కల్పించాలని, లేనియెడల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 1న విజయవాడలో సమ్మె చేపడుతున్నామని అప్పటి వరకు విడత వారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనందమోహన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులపై నిర్లక్ష్యం..!

- అడవులను తలపిస్తున్న కట్టలు
- మరమ్మతులకు నోచుకోని తూములు
- దెబ్బతిన్న అలుగులు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

సాగునీటితో పాటు, తాగునీటికి ఎంతో ఉపయోగంగా ఉంటున్న చెరువులు అధికారులు, పాలకుల నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతోన్నాయి. చెరువుల కట్టలపై చిల్లచెట్లు పెరిగి అడవులను తలపిస్తోన్నాయి. వరదల సమయంలో దెబ్బతిన్న అలుగులు, తూములు మరమ్మతులకు నోచుకోలేదు. ఈ క్రమంలో చెరువు కట్టలపై చీమలు పుట్టలు పెట్టి నెర్రెలు బారడంతో కట్టలు బలహీనపడుతోన్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అయినా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి.


వలేటివారిపాలెం : రామన్నచెరువు కట్టపై దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

వలేటివారిపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 37 సాగునీటి చెరువులు ఉన్నాయి. అన్ని చెరువుల కట్టలు చిల్లచెట్లతో అడవులను తలపిస్తోన్నాయి. సాధారణంగా ఆయకట్టు చెరువులకు నీరు చేరకముందే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తూములకు, కట్టలకు మమరమ్మతులు చేయించాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఈ ఏడాది చెరువుల్లోకి పూర్తిస్థాయిలో వర్షం నీరు రాలేదు. చెరువులు పూర్తిస్థాయిలో నిండితే చెరువుకట్టలు తెగిపోయే ప్రమాదం ఉండేది. అంతేగాకుండా మరికొన్ని గ్రామాల్లో చెరువులు ఆక్రమణలతో కుంచించుకపోతున్నాయి. చెరువు అలుగులు దెబ్బతిన్నాయి. గత వైసీపీ పాలనలో ఆయకట్టు చెరువులను గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. గతంలో చెరువు కట్టలపై ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు కూడా వెళ్లేవి. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. చెరువు కట్టలపై చెట్లు పెరిగి బలహీనపడ్డాయి. అంతేగాకుండా చెరువుల తూములు కూడా దెబ్బతిన్నాయి. అలుగులు వరద ఉధృతికి కొట్టుకపోయాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా చెరువుల నిర్వాహణను గాలికొదిలేసిందని రైతులు వాపోతున్నారు. వర్షాకాలంలో చెరువులకు నీరు వచ్చినా పంట పండించుకునే అవకాశం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా చెరువులకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

చెరువులకు మరమ్మతులు చేపట్టాలి

పల్లెల్లో వ్యవసాయానికి సాగునీటితోపాటు, తాగునీటికి ప్రధాన వనరులైన చెరువులను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికైనా చెరువులకు మరమ్మతులు చేపట్టాలి.

- వీరమోసు అంజయ్య,
రైతు, వలేటివారిపాలెం


వరద ఉధృతికి దెబ్బతిన్న చెరువు అలుగు, మరమ్మతులకు నోచక ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు

ప్రసన్న వేంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు

బిట్రగుంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల అనంతరం ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. గండవరం టెంపుల్ గ్రూపు కార్యనిర్వాహణాధికారి ఉమాబాయ్ పర్యవేక్షణలో కావలి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఏ.లక్ష్మీనారాయణ, సిబ్బంది, సేవా సంస్థల వారు హుండీ లెక్కింపు చేశారు. స్వామి అమ్మవార్లకు భక్తులు అందచేసిన కానుకలు 22 లక్షల 14 వేల 579 రూపాయలు వచ్చాయని ఈవో తెలిపారు. గత ఏడాది బ్రహ్మోత్సవాలకు 16 లక్షల 39 వేల 801 రూపాయలు వచ్చిందని, ఈ ఏడాది 5లక్షల 74 వేల 778 రూపాయలు అదనంగా వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి, ఆలయ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.


హుండీల్లో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఈవోపై చర్యలు తీసుకోండి

బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో రాధాకృష్ణ నిర్లక్ష్య ధోరణి వలన బ్రహ్మోత్సవాల్లో అపశృతులు జరిగాయని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం ఆలయానికి వచ్చిన దేవాదయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈవో అహంకార ధోరణిలో భాగంగానే 2023 బ్రహ్మోత్సవాల్లో రథం నేలకు ఒరిగిందన్నారు. 2025లో కూడా రథోత్సవానికి ముందు ట్రైల్ రన్ వేయకపోవడంతో అపశృతి వాటిల్లిందన్నారు. దేవస్థానంలో ఈవో రాధాకృష్ణ సోదరుడు రాంబాబు పెత్తనం చెలాయిస్తూ భక్తులు, గ్రామస్థులకు సమాధానం చెప్పకుండా ఇబ్బంది పెడుతున్నాడని తెలిపారు. తక్షణం ఈవో రాధాకృష్ణను సస్పెండ్ చేయాలని లేకపోతే బదిలీ అయినా చేయాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి అదనపు నిధులు

లింగసముద్రం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వివిధ దశలలో నిర్మాణాలు ఆగిన పక్కా గృహాల ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తుందని గృహ నిర్మాణ శాఖ కందుకూరు డీఈ పీవీ నారాయణరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ 2016-17 నుంచి ఎన్టీఆర్ పథకం కింద, 2019-24లలో ఎన్టీఆర్ కాలనీలలో యూనిట్ ఖరీదు రూ.1.80 లక్షలు చాలక వివిధ దశలలో నిలిచిన ఎస్సీ, బీసీ లబ్ధిదారుల గృహాలకు మరొ రూ.50 వేల, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు అందిస్తుందన్నారు. ఈ పథకానికి నియోజకవర్గంలో ఎస్సీలు 1230, ఎస్టీలు 271, బీసీలు 677 మంది ఉన్నారని చెప్పారు. ఇందులో లింగసముద్రం మండలంలో ఎస్సీలు 147, ఎస్టీలు 37, బీసీలు 140 మందితో 324 మంది ఉన్నారని తెలిపారు. వీరంతా కులధ్రువీకరణ పత్రాలను ఆయా మండలాల్లోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల్లో అధికారులకు అందజేయాలన్నారు. అలాగే పీఎంఏవై 2.0 కింద మండలంలో ఇప్పటి వరకు 1190 మంది పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకున్నారని, 706 మంది పొజిషన్ సర్టిఫికెట్లు(పీసీ) ఇచ్చారని చెప్పారు. పీసీలు ఇవ్వకపోతే గృహాలు మంజూరు కావని చెప్పారు. పక్కా గృహాల మంజూరుకు ఈ నెలాఖరుకు ఉన్నతాధికారులకు డీపీఆర్‌లు పంపిస్తామని చెప్పారు. డీఈ వెంట మండల ఇన్‌చార్జ్ ఏఈ జె నాగరాజు ఉన్నారు.


ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న హౌసింగ్ కందుకూరు డీఈ నారాయణరెడ్డి

అరువు తెచ్చుకున్న వ్యక్తితో
కాకర్లపై అసత్య ఆరోపణలు

జలదంకి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై నియోజకవర్గంలో విమర్శలు చేసేందుకు వైసీపీ నాయకులు లేకపోవడంతో ఆపార్టీ ఉదయగిరి ఇంచార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నెల్లూరు నుంచి అరువు తెచ్చుకున్న వ్యక్తితో అసత్య విమర్శలు చేయించాడని జలదంకి టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కమ్మవారిపాలెంలో టీడీపీ నేత కరియావుల అప్పలయ్యనాయుడు నివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్లపై అవినీతి ఆరోపణలు చేసే నాయకులు ముందు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎవరేమి చేశారో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి బయటపెట్టేది చాలదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో తొమ్మిది నెలల్లో ఎంత అభివృద్ధి జరిగిందో కాకాణికి స్వయంగా చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఐదేళ్ల పాలనలో మీరు చేసిన అభివృద్ధి చూపించేందుకు సిద్ధమా అని వైసీపీ నేత రాజారెడ్డికి సవాల్ విసిరారు. సోమశిల ప్రాజెక్ట్ వైస్‌ఛైర్మన్ పి.మధుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో తెలుగురైతు అధ్యక్షుడు పీ.భాస్కర్‌రెడ్డి, నాయకులు మందపల్లి మాల్యాద్రి యాదవ్, జాజుల శివరామయ్య, జాజుల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన


ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఆర్టీసీ డిపో ట్రాఫిక్ విభాగానికి చెందిన అసిస్టెంట్ మేనేజర్ శ్యాంప్రసాద్ తీరుకు నిరసనగా కార్మికుల యూనియన్ జేఏసీ నాయకులు సోమవారం డిపో ఎదుట నిరసన తెలిపారు. యూనియన్ నాయకుల పట్ల అసిస్టెంట్ మేనేజర్ అవమానకరంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కార్మికుల ఫిర్యాదును డిపో మేనేజర్ పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ, టీఎన్‌టీయూసీ, వైఎస్ఆర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ పరిధిలో సోమవారం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతగా ప్రారంభమయ్యాయి. 8 పరీక్షా కేంద్రాల్లో 1233 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 8 మంది గైర్హాజరయ్యారని ఉప విద్యాశాఖాధికారి నరసింహారావు తెలిపారు.

- కావలిటౌన్ : పట్టణంలో 12, తుమ్మలపెంటలో 1 పరీక్ష కేంద్రాల్లో 2,428 మంది విద్యార్థులకు 20 మంది గైర్హాజరయ్యారు. కలుగోళమ్మపేటలో సన్నటి వీధిలో మున్సిపల్ హైస్కూల్, నలందా స్కూల్ పరీక్ష కేంద్రాలు 20 అడుగుల దగ్గరలో ఉండడంతో విద్యార్థులు తల్లితండ్రులతో ఆ ప్రాంతం తిరునాళ్లను తలపించింది. పైగా అదే వీధిలో రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ఉండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది.
- లింగసముద్రం : లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో 216 మంది, పెదపవనిలోని శ్రీ భోళేరావు జడ్పీ హైస్కూల్‌లో 175 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్‌లు మాధవరావు, కమల్‌కుమార్‌లు చెప్పారు. ఎంఈఓ-2 ఎంవీ శివకుమార్ తనిఖీ చేశారు.
- వలేటివారిపాలెం : మండలంలోని వలేటివారిపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 186 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా పోకూరు హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో 183 మందికి 182 మంది హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజైనట్లు ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు.
- ఉలవపాడు : ఉలవపాడులో 3 పరీక్ష కేంద్రాలు, రామాయపట్నంలో 1 పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 635 మంది విద్యార్థులకు 5 మంది గైరుహాజరై 630 మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో-2 రమణయ్య తెలిపారు.
- కలిగిరి: మండలంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో 199 మంది విద్యార్థులకు 196 మంది, జడ్పీ హైస్కూల్‌లో 186 మందికి 185 మంది హాజరయ్యారని చీఫ్ అధికారులు ఏ శ్రీను, ఎస్ భీమేశ్వర తెలిపారు. విద్యార్థులు ముందుగా ఆలయాల్లో పూజలు చేశారు.


ఉలవపాడులో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

రూ. వేలల్లో విద్యుత్ బిల్లులు, పన్నులు..
పేదలు ఎలా చెల్లించాలి : సీపీఎం

కావలిటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పేద మధ్య తరగతి ప్రజలు ఒకేసారి వేలల్లో విద్యుత్ బిల్లులు, ఇంటి, నీటి పన్నులు ఎలా చెల్లించగలరని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య ఆవేదన వక్యం చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం 19, 22వార్డులలో పర్యటించి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలసి సచివాలయానికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ.మధుసూదన్‌రావు, కృష్ణయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం

కావలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ విజయవంతంతో జనసైనికులు ఆనందోత్సాహంలో ఉన్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఒక వ్యక్తి కాదు శక్తి అని దేశ ప్రధాని అన్నట్లుగా ఆవిర్భావ సభవిజయవంతంతో పవన్‌కల్యాణ్ ఎమిటో నిరూపించుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. పవన్ కల్యాణ్ బూస్ట్‌తో కావలిలో జనసేన బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జనసైనికులు షేక్ షమ్మీ, పీవీ రమణయ్య, ఎం. శ్రీనివాసులు, షేక్ జానీ, జిలానీ, కొడయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు లావణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల గౌరవ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగలకు పీఆర్సీ ఐఆర్ వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇవ్వాలని, క్వాంటమ్ పెన్షన్ పూర్వ పద్ధతిలో చెల్లించాలని, ఈహెచ్ఎస్ సౌకర్యం తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిమ్మిరి నరసింహం, ఇంటూరి మాల్యాద్రి, చెన్నయ్య, శ్రీను, బషీర్, నజీర్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


తహసీల్దారు లావణ్యకు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

తహసీల్దారు లావణ్య బాధ్యతల స్వీకరణ

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారుగా వీ.లావణ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉలవపాడు తహసీల్దారుగా పనిచేస్తున్న ఆమె బదిలీపై కందుకూరుకు వచ్చారు. కందుకూరు తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఇక్బాల్‌ను సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏవోగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా సకాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కావలిటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని కచ్చేరిమిట్టలో వెలసివున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నవరం సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు బుర్రా శేషాచార్యులు యాజ్ఞిక నిర్వహణలో ఉదయం స్నపన హోమం పూజలు జరిగాయి. ఉత్సవమూర్తులకు అభిషేకాలు, చందన అలంకరణ, పూలంగి సేవ నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఆలయ కమిటీ బాధ్యులు తిరివీధి ప్రసాద్ దంపతులు అన్నదానం చేశారు. రాత్రి శ్రీవారికి ఏకాంత సేవ కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమాలను బ్రహ్మోత్సవ నిర్వహణ కమిటీ బాధ్యులు తిరివీధి బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్, నరహరి హరిబాబు, రామకృష్ణ, గోపాల్, నరసింహరావు, ఏ.శ్రీనివాసులు, మధుసూదన్‌రావు పర్యవేక్షించారు.


భక్తులకు అన్నదానం చేస్తున్న దాత తిరివీధి ప్రసాద్

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు!

కలిగిరి మండలం వీర్లకొల్లు, నాగసముద్రం, కమ్మవారిపాలెం, కలిగిరి గ్రామాల చుట్టుపక్కల చెరువులు, ప్రభుత్వ భూములు, వాగుపోరంబోకు భూముల్లో రాత్రి వేళల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తే అధికార పార్టీ అండదండలున్నాయి జాగ్రత్త.. అంటూ హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చెరవులు, ప్రభుత్వ భూముల్లో మట్టి మాఫియా 10 నుంచి 20 అడుగుల మేర లోతు తవ్వుతుండడంతో ఎద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో పశువుల కాపరులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా వీర్లకొల్లు, నాగసముద్రం, కలిగిరి చట్టు పక్కల ప్రాంతాల్లో సెలవు దినాలలో మాత్రమే రాత్రివేళల్లో మట్టి తరలిస్తుండాన్ని గుర్తించామని, ఈ విషయపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

- కలిగిరి(ఆంధ్రజ్యోతి)


కలిగిరి సమీపంలోని వాగు పోరంబోకులో మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

న్యూస్ బాక్స్

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కందుకూరు కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు, ద్వితీయ సంవత్సరంలో 12 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 9666092091ను సంప్రదించాలని పేర్కొన్నారు.

92 కుట్టు మిషన్ల మంజూరు

వలేటివారిపాలెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : మండలానికి 92 కుట్టు మిషన్లు మంజూరైనట్లు ఎంపీడీవో నరేంద్రదేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో బీసీ ఏ-9, బీసీ బి-7, బీసీ డీ-8, బీసీ సీ-5, కమ్మ-15, రెడ్డి-24, ఈబీసీ-14, ఆర్యవైశ్య-6, బ్రాహ్మణులకు 4, క్షత్రియలకు 1, కాపులకు 1 మంజూరైనట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 19వ తేది లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజరు బాధ్యతల స్వీకరణ

లింగసముద్రం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్‌గా నియమితులైన బీ నీలాంబరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుడ్లూరు మండల సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆమె బదిలీపై మండలానికి వచ్చారు. ముందుగా ఎంపీడీవో కే.శ్రీనివాసులును కలిసి విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు అంగన్వాడీ కార్యకర్తలు శైలజ, రమాదేవి, మాధవి, ప్రభావతి శుభాకాంక్షలు తెలిపారు.

25న జాబ్‌మేళా

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25వ తేదీన రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవికుమార్, డీఎస్‌డీవో ఎస్‌కే అబ్దుల్ ఖయ్యూం, జేకేసీ కోఆర్డినేటర్ రాజగోపాల్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెటిరో ల్యాబ్స్, ఏరీస్ ఆగ్రో, ఎస్బిఐ కార్డ్స్, డైకిన్, పేటీఎం ఇతర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లమో అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 984805054ను సంప్రదించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

టీ దుకాణంలో చోరీ

లింగసముద్రం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని పాత కెనరా బ్యాంకు వద్ద ఉన్న ఓ టీ దుకాణంలో పట్టపగలే రూ.1000 పైగా చోరీ చేశారు. రాజస్థాన్ టీ దుకాణం యజమాని మదన్ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు భోజనానికి పక్కనే ఉన్న ఇంటికి వెళ్లాడు. తిరిగి 3 గంటల వచ్చి చూడగా దుకాణంలోని టేబుల్ డ్రాయర్ పగులగొట్టి ఉండడాన్ని గమనించాడు. అందులో పరిశీలించగా రూ.1000లకు పైగా ఉన్న డబ్బులు కనిపించలేదు. దీంతో ఎవరో చోరీ చేసినట్టు వాపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

వివాదాస్పద భూముల్లోకి ఎవరూ దిగవద్దు!

కొండాపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరప్పాడు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్లు 151, 166, 167, 168లోని వివాదాస్పద భూముల్లోకి ఎవరూ వెళ్లవద్దంటూ తహసీల్దారు హెచ్చరించారు. ఈ మేరకు 145 సెక్షన్ జారీ చేశారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివాదాస్పదంగా ఉన్న భూమి విషయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని మాజీ సర్పంచు చాగంటి క్రిష్ణ, గ్రామస్థులు మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు తదితరులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎస్ఐ ఎం.వెంకటరావులు చర్యలు చేపట్టారు.

రవ్వా శ్రీనివాసులుకు ఛత్రపతి శివాజీ జాతీయ పురస్కారం

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : కందుకూరు పట్టణానికి చెందిన శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులకి పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ ఉత్తమ సేవా పురస్కారం అందచేశారని అవార్డు గ్రహీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న 4 రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన వారిలో తన పేరు ఉండటం గర్వించదగ్గ విష యమని, అవార్డుకు ఎంపిక చేసిన తిరు మలశెట్టి ఉమాశంకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

అల్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల చట్టంపై అవగాహన ఉంటేనే రక్షణ పొందగలరని పేర్కొన్నారు.



చావనైనా చస్తాం పరిశ్రమలకు భూములివ్వం

కావలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 'చావనైనా చస్తాం. కానీ మా భూములను పరిశ్రమలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేది లేదు.' అని కావలి రూరల్ మండలం ఆనెమడుగు రైతులు తేల్చి చెప్పారు. బలవంతంగా భూములు లాక్కుంటే 28వ తేదీ నుంచి ఆందోళనలు చేపడతామని వారికి మద్దతుగా నిలిచిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేపట్టారు. గ్రామసభలు పెట్టకుండానే తమ అనుమతితో 758 ఎకరాలు సేకరించినట్లు పత్రికల్లో ప్రకటించడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. ఏడాదికి మూడు కారులు పండే తమ భూములను ఎకరాకు రూ.2 కోట్లు ఇచ్చినా తాము ఇవ్వమని స్పష్టం చేశారు. తమ భూములను తీసుకోవాలనుకుంటే రైతులకు తలా కొంత విషం ఇచ్చి తమ ప్రాణాలు తీసిన తర్వాత ఉచితంగా తీసుకోవచ్చని తెగేసి చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2013, భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీకృష్ణ ధర్నా వద్దకు వచ్చి రైతుల సమస్యలను విన్నారు. భూసేకరణలో తమ ప్రమేయం ఏమీ లేదని చట్ట ప్రకారమే జరుగుతోందన్నారు. ఎవరి భూములను బలవంతంగా తీసుకోలేదని చెప్పారు. ఈ ధర్నాలో నాయకులు పుల్లయ్య, వెంకమరాజు, తాళ్లూరు మాల్యాద్రి పాల్గొన్నారు.

రంగనాథుడికి అశ్వవాహన సేవ



నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం తిరుమంజనం సేవ, గంగాళాల తిరుమంజనం జరిగాయి. రాత్రికి స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కిడాంబి వెంకట నరసింహచార్యుల కుటుంబం, అత్రివణం కుటుంబీకులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో అళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

దళితుల భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి

నెల్లూరు (హరనాథపురం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం మండలం ఊటుకూరులో దళితుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఉంచిన నిషేధ బోర్డును తొలగించి, వారికి యాజమాన్య హక్కు కల్పించాలని అఖిల భారత్ రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య మాట్లాడుతూ భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ బంజరు, మిగులు, పోరంబోకు భూములను దళితులకు, ఇతర పేదలకు పంచి పెట్టాలన్నారు. పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పందిటి వెంకటయ్య, కే రమేష్, బీ మమత, పీ.అనుష, ఏ.నాగమణి, పీ.పెంచలయ్య, పీ.కోటయ్య, పీ.శ్రీను, పాల్గొన్నారు.



యోగి వేమన వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా అల్లం



వెంకటాచలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్వర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో వీసీగా ఉన్న ఆయనకు ఆదనపు బాధ్యతలు అప్పగించారు. గవర్నర్ ఆదేశాల మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఈ ఉత్తర్వులను విడుదల చేశారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలసుధాకర్

నెల్లూరు (వైద్యం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తలారి బాలసుధాకర్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి సోమవారం ఎంపిక చేశారు. ఆయనతో పాటు 27 మంది కమిటీ సభ్యులను కూడా నియమించారు. బాలసుధాకర్‌ను ఎంపిక చేయడంలో సహకరించిన జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సుధాకర్ కలిసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు కొప్పుల రాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ యాదవ్‌లకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియచేశారు.





భారతీయ శాస్త్రీయ సంగీత వాద్య పరికరాల్లో ఉత్కృష్టమైనదిగా గుర్తింపు పొందిన వీణా వాద్యంలో ఆమె దిట్ట. ఏడు తంత్రులతో సప్త స్వరాలను రసరమ్యంగా వినిపించే విదుషీమణి. విపంచిపై ఏ రాగాన్ని అయినా అలవోకగా పలికించగల అద్భుత వైణికురాలు. తల్లి నుంచి అబ్బిన సంగీత జ్ఞానానికి సాధనతో సానబెట్టి విద్వాంసురాలిగా ఎదిగిన వాగ్దేవీ రూపం. ఎన్నో ప్రదర్శనలు, ఎందరి నుంచో ప్రశంసలు, పురస్కారాలు అందుకుంటున్నా అంతటితో ఆగక తనలాంటి మరెందరినో వీణా వాద్యకారులుగా, సంగీత కళాకారులుగా తీర్చిదిద్దుతున్న గురువు. ఆ విద్యా లక్ష్మియే నెల్లూరుకు చెందిన చావలి వెంకట శ్రీలక్ష్మి.

- సంగీత విదుషీమణి వెంకట శ్రీలక్ష్మి
- వీణ వాద్యంతో ఎన్నో ప్రదర్శనలు, ప్రశంసలు
- దేశ, విదేశాల్లోని వారికి శిక్షణ

గాత్ర లక్ష్మి.. వీణా వాణి!

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వెంకట శ్రీలక్ష్మి కాకినాడలో సంగీత కుటుంబంలో జన్మించారు. ఆమె తల్లి సుచర్ల అన్నపూర్ణ గాయని. ఆమె ప్రేరణతో శ్రీలక్ష్మి సంగీతంపై మక్కువ పెంచుకున్నారు. తల్లి మార్గనిర్దేశానికితోడు విజయనగరం సంగీత కళాశాలలో చేరి మరిన్ని మెలకువలు నేర్చుకుని సంగీత విద్వాంసురాలిగా, వాద్యకారిణిగా ఎదిగారు. వీణా వాద్యంలో చెన్నైలో డిప్లమో సాధించారు. 18 సంవత్సరాలుగా ఎన్నో ప్రదర్శనలిచ్చారు. ఆమె తమ్ముడు యజ్ఞతేజ కూడా గాయకుడు, వాయిద్యకారుడు కావడం విశేషం. షేర్ మార్కెట్ కార్యాలయంలో పని చేసే చావలి మిత్ర రామకృష్ణను వివాహం చేసుకున్నారు. భర్త ఉద్యోగ రీత్యా ఆమె నెల్లూరు వేదాయపాళెంలో స్థిరపడ్డారు.

సంగీత పాఠశాలతో శిక్షణ

చావలి శ్రీలక్ష్మి 2007 నుంచి సంగీత పాఠశాల నిర్వహిస్తున్నారు. డాక్టర్ ఎస్‌బీఎస్ సంగీత కళాపీఠం పేరుతో ఆ పాఠశాల నడుపుతూ వీణ, సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం కళాపీఠంలోనేకాక ఆన్‌లైన్ ద్వారా కూడా దేశ విదేశాలలోని వారికి శిక్షణ ఇస్తున్నారు. ప్రతిభ కలిగిన శిష్యులకు బొబ్బిలి వీణ, నూజివీడు మధుర వీణ వంటివి బహూకరించి మరింత ప్రోత్సహిస్తున్నారు. ప్రముఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాల్లో వీణ, గాత్ర కచేరీలు చేస్తున్నారు. తన స్వరార్చనతో భక్తులను అలరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రముఖుల నుంచి ప్రశంసలు, పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. శ్రీలక్ష్మి శిష్య బృందం యువజనోత్సవాల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడం విశేషం.



విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీలక్ష్మి



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పోటీలకు న్యాయ నిర్ణేతగా హాజరై సన్మానం అందుకుంటూ..



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఆర్వో, ఇతర ఉన్నతాధికారులు

ఎండను సైతం లెక్కచేయక

వినతుల వెల్లువ

- కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

నెల్లూరు (హరనాథపురం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండే ఎండను సైతం లెక్కచేయకుండా సోమవారం జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వందలాదిగా అర్జీదారులు తరలివచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ ఆనంద్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ గంగాభవానీ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో ధాన్యం ధరలు రోజురోజుకి తగ్గిపోతున్నాయని, వెంటనే రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని అఖిలపక్ష రైతు సంఘం నేతలు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు పుట్టికి రూ.16,500 మాత్రమే ఇస్తున్నారని, తేమ పేరుతో 70 కిలోల ధాన్యాన్ని తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మిల్లుకు తీసుకెళ్లేందుకు జీపీఎస్ ఉన్న ట్రాక్టర్లు దొరకడంలేదని, జీపీఎస్ ఏర్పాటు చేసుకున్నా అది యాక్టివేట్ కావడం లేదని చెప్పారు. ఇంకా ధాన్యం ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. సమస్యలు పరిష్కరించి రైతులకు మంచి ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

- భూములు కాపాడాలి

జిల్లాలో మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిన భూములను కొంతమంది ఆక్రమించి, ఇబ్బందులు పెడుతున్నారని, వారి భూములను కాపాడాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మాబు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

- భూకుంభకోణంపై విచారణ జరపాలి

నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడు సర్వే నెంబరు 3లో తహసీల్దారు ఇచ్చిన భూములను రద్దు చేయాలని ఆమంచర్ల పంచాయతీ రైతులు, రాచమల్లి రమేష్ కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు.

- అవకాశం ఇవ్వాలి

బయో మెడికల్ వ్యర్థాలు సేకరించడానికి తమ సంస్థకు అవకాశం ఇవ్వాలని ఏవీఏ బయో కేర్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు.

- బకాయిలు చెల్లించాలి

విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షుడు ఐ.లక్ష్మీనారాయణ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిం చారు. స్పందించిన కలెక్టర్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- ఎస్పీని కోరిన బాధితులు

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 'నమ్మి మోసపోయాం.... మీరే ఆదుకోండి సార్... అంటూ జిల్లా ఎస్పీ జీ. కృష్ణకాంత్‌ను పలువురు బాధితులు కోరారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురు ఆయనకు అర్జీలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 75 మంది వినతులు అందించారు. ఎస్పీకి అందిన ఫిర్యాదుల్లో కొన్ని పరిశీలిస్తే...

- నగరంలోని వేదాయపాలెంకు చెందిన ఓ వ్యక్తికి వాట్సాప్ ద్వారా జ్యోతిర్నాథ్ పరిచయమయ్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.2.10 లక్షలు తీసుకొని మోసం చేశాడు. నగదు తిరిగి ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.
- వేదాయపాలెంకి చెందిన వ్యక్తికి అదే ప్రాంతానికి చెందిన వెంకటరావు పరిచయం అయ్యాడు. బీవీ నగర్‌లో స్టీల్ కంపెనీలో డీజీల్ మోటర్స్ ఇప్పిస్తానని నమ్మించి రూ.4.20 లక్షలు తీసుకున్నాడు. మోటర్స్ ఇప్పించకుండా, నగదు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని కోరాడు.
- వేదాయపాలెంకి చెందిన మరోవ్యక్తి వద్ద తమిళనాడుకి చెందిన లక్ష్మీనారాయణ, రావి సెల్వంలు ప్రముఖ వర్సిటీలో పీజీ మెడికల్ సీటు ఇప్పిస్తానని నమ్మించి రూ.20 లక్షలు తీసుకున్నారు. అయితే సీటు ఇప్పించకుండా మోసం చేశాడని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.
- బుచ్చికి చెందిన వ్యక్తికి విజయవాడ వాసులు రామకృష్ణ, దివ్య, జగిత్యాల వాసులు శ్రీనివాస్, రిజ్వాన, అస్పులు అబుదాబిలో వర్కింగ్ వీసా ఇప్పిస్తామని, నెలకు రూ.80 వేలు వస్తుందని నమ్మించారు. వారిని నమ్మి రూ.2.70 లక్షలు ఇచ్చాడు. విజిటింగ్ వీసా ఇప్పించి మోసం చేశారని న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

- కాంట్రాక్ట్ బేసిక్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని అనంతసాగరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదే ప్రాంతానికి చెందిన ఎస్‌డీ ఖాజామోహిద్దీన్ నమ్మించి రూ.5.62 లక్షలు తీసుకుని మోసం చేశాడు. న్యాయం చేయాలని బాధితులు కోరారు.
- అల్లూరుకు చెందిన బత్తల బ్రహ్మారెడ్డి ఇతరుల పొలంలో గడ్డి కొనుగోలు చేసి, కట్టించుకుంటూ ఉంటే అదే ప్రాంతానికి చెందిన సుమంత్, శూలంతో ఘర్షణ జరిగింది. స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారం గడిచినా కేసు నమోదు చేయలేదని, విచారించి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

పంటలు అమ్ముకునే అవకాశం ఇవ్వండి

నెల్లూరు (వైద్యం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మహిళా రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలను అమ్ముకునే అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నేతలు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఈ మేరకు వినతిపత్రం అందించారు. అనంతరం కాంగ్రెస్ సిటీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, సుధీర్ మాట్లాడారు. మహిళలు పండించిన పంటలను రోడ్డుపై అమ్ముకోలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద అమ్ముకుంటున్నారన్నారు. అయితే కొంత మంది టాక్సుల పేరుతో దోపిడీ చేస్తున్నారని, అలాగే కొందరు పోలీసులు దౌర్జన్యాలతో మహిళలు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో స్వేచ్ఛగా మహిళలు పంటలు అమ్ముకునేలా అవకాశం కల్పించాలని కోరారు.



కలెక్టర్‌కి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అరుదైన కణితిని నగరంలోని జీజీహెచ్ వైద్య నిపుణులు తొలగించారు. వివారాలు.. సోమవారం తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన తాటిపర్తి శశికళ (35) జీజీహెచ్‌కి వచ్చారు. ఆమె ఎడమ కాలు విపరీతమైన నొప్పితో ఆసుపత్రికి వచ్చారని ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ కాలేషా బాషా వెల్లడించారు. పూర్తిగా పరీక్షించగా ఎడమ కాలిలో కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఐదేళ్లగా పలు ఆసుపత్రులకు తిరిగినా ప్రయోజనం లేకపోవటంతో ఆఖరికి జీజీహెచ్‌ని సంప్రదించారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం బాధితురాలికి శస్త్రచికిత్స నిర్వహించి, ఎడమకాలిలో ఐదు కిలోల కణితిని తొలగించామన్నారు. బాధితురాలు ప్రస్తుతం కోలుకుంటుందని వివరించారు. డాక్టర్ సుహాసిని, డాక్టర్ ఉమామహేష్, మత్తు వైద్యనిపుణులు డాక్టర్ శారద ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిర్వహించామని తెలియచేశారు. కాగా శస్త్రచికిత్స విజయవంతంపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ డాక్టర్లను అభినందించారు.

ఏపీపీగా చెంచుకృష్ణ

నెల్లూరు (లీగల్), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా నగరానికి చెందిన న్యాయవాది ఎం చెంచుకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పదవీ కాలం మూడేళ్లు. నెలకు రూ.40వేలు గౌరవ వేతనం చెల్లిస్తారు.

కౌన్సెలింగ్‌లో గందరగోళం

- ఉద్యోగోన్నతుల జాబితాలో కాంట్రాక్టు ఏఎన్ఎంల పేర్లు
- ఆరోపణలతో హడావుడిగా మార్పు
- కలెక్టర్‌కు దళిత సంఘాల ఫిర్యాదు

నెల్లూరు (వైద్యం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఏఎన్ఎంల ఉద్యోగోన్నతులకు సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. మెరిట్ జాబితాపై వస్తున్న విమర్శలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయటంతో రెండుసార్లు జాబితాలో మార్పులు చేశారు. ఇందులో కొందరు అధికారులు కాంట్రాక్టు ఏఎన్ఎంల పేర్లు కూడా ఎక్కించి, వారి వద్ద భారీగా ముడుపులు తీసుకున్నారననే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వారి పేర్లను జాబితా నుంచి తొలగించినట్లు సమాచారం.

- ముడుపులు ఇచ్చినవారికే ప్రాధాన్యం

830 మంది సచివాలయ ఏఎన్ఎంలలో 289 మందికి గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ వన్‌కి ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉంది. ఇందులో నాలుగు శాతం దివ్యాంగులకు రిజర్వేషన్ కోటాలో 8 మందికి అవకాశం ఇవ్వాలి. అలాగే మెరిట్‌తో పాటు స్పౌజ్ కింద రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉంది. అలాగే ఎస్సీలకు 15, ఎస్టీలకు ఆరు శాతం రిజర్వేషన్‌లు కల్పించాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలన్ని పక్కన పెట్టి ముడుపులు ఇచ్చిన వారికి ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో దళిత సంఘాల నేతలు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.సచివాలయ ఏఎన్ఎంల ఉద్యోగోన్నతిలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కలెక్టరు స్పందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఏఎన్ఎంల ఉద్యోగోన్నతిపై కౌన్సెలింగ్ జరుగుతుందని, అది పూర్తయ్యాక అధికారులపై విచారణ జరుపుతానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

- ఆరోపణలు ఎదుర్కొన్నవారే అంతా చేశారు..

ఈ కౌన్సెలింగ్‌ను ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులే నిర్వహించటం పలు విమర్శలకు తావిస్తున్నది. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఉన్నా జాబితా తయారీలో జరిగిన అవకతవకలపై అవగాహన లేదు. దీంతో ఆమెను తప్పుదోవ పట్టించారన్న ఆరోపణలున్నాయి.కాగా కౌన్సెలింగ్‌లో పెద్దఎత్తున ఏఎన్ఎంలు పాల్గొన్నారు. వారేకాక తల్లిదండ్రులు, భర్తలు తరలి రావటంతో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఏవో డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



జాబితా మార్పును ఆసక్తిగా తిలకిస్తున్న ఏఎన్ఎం, సహాయకులు

కోవూరు
సర్వేపల్లి

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షకు 36మంది గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షకు 36మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి ఆర్.మధుమతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలో ముగ్గురు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలో 488మందిలో 452 మంది హాజరయ్యారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8440
వెండి కిలో ధర	రూ. 1,03,100
వెండి ఒక గ్రాము	రూ.106.10

న్యూస్ బాక్స్

రేషన్ డీలర్ మృతికి సంతాపం

మనుబోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడకు చెందిన రేషన్ డీలర్ మీనా (26) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందింది. ఈమె పదేళ్లుగా యాచవరం రేషన్‌డీలర్‌గా పనిచేస్తోంది. కొద్దినెలలుగా మీనా మూత్రపిండ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతూ కోలుకోలేక పోయింది. మీనా మృతిపై మండల డీలర్ అసోసియేషన్ నాయకులు గోను దశయ్య, షబ్బీర్‌లు సంతాపం వ్యక్తం చేశారు.

పవన్‌ను విమర్శించేస్థాయి కాదు

రామచంద్రయాదవ్‌పై బొబ్బేపల్లి ఫైర్



మాట్లాడుతున్న బొబ్బేపల్లి సురేష్‌నాయుడు

వెంకటాచలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను విమర్శించేస్థాయి బీసీవై అధినేత బోడే రామచంద్రయాదవ్‌కు లేదని నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. వెంకటాచలంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఈ విషయంపై ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్న పవన్‌కల్యాణ్‌పై ఇలా ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, రామిరెడ్డి, మణి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మితే మద్దతు ధర

- తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బయ్య

మనుబోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర దక్కాలంటే రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య తెలిపారు. సోమవారం అక్కంపేట, మడమనూరు గ్రామాల్లో ధాన్యం ఆరబోత స్థలాల వద్దకు తహసీల్దారు వెళ్లి రైతులతో మాట్లాడారు. ఏ రకం ధాన్యం వేశారు. ఎంత దిగుమతి వచ్చింది, ఎంతకు విక్రయిస్తున్నారు అని వివరాలు తెలుసుకున్నారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జహీర్, వీఆర్వో మురళీధర్ ఉన్నారు.

రక్తదానంతో ప్రమాద బాధితులకు ప్రాణరక్షణ

- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పొదలకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వలన అత్యవసర సమయాల్లో ప్రమాద బాధితుల ప్రాణాలు కాపాడవచ్చని ప్రభుత్వ ఉపాధ్యాయుడు బడుగు శ్రీనివాసులు తెలిపారు. బిరదవోలులో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన రక్తదాన శిబిరాన్ని పొదలకూరు ఎస్‌ఐ హనీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడారు. గ్రామస్థుల సహకారంతో నాలుగేళ్ల రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్తదానం ఉద్దేశాన్ని వివరిస్తూ యువతను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తం అందించాలన్న రెడ్‌క్రాస్ ఆలోచనకు తనవంతు బాధ్యతగా తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులందరికీ బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గ్రామ యువత పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు



బుచ్చి : పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రంలో ఉన్న విద్యార్థులు టీపీగూడూరులో..

తొలిరోజు ప్రశాంతం

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బుచ్చిరెడ్డిపాలెం మండలంలో ఏర్పాటు చేసిన 6కేంద్రాల్లో 14మంది, తోటపల్లిగూడూరు మండలంలోని రెండు కేంద్రాల్లో ఒక విద్యార్థి, మనుబోలు మండలంలోని రెండు కేంద్రాల్లో నలుగురు, వెంకటాచలం మండలంలోని ఏడు కేంద్రాల్లో 9మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు తీసుకున్నారు.



ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం



స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రంలో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల మొదటి విడత మూల్యాంకనం సోమవారం నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ నెల 7నుంచి జరుగుతున్న సంస్కృత మూల్యాంకనంతో పాటు ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, సివిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనాన్ని ప్రారంభించారు. ఇందుకుగాను 480మంది అధ్యాపకులను నియమించారు. ఏప్రిల్ మొదటి వారానికి మూల్యాకనం పూర్తిచేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 22నుంచి మిగిలిన సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. మూల్యాంకనానికి హాజరు కాని అధ్యాపకులు వెంటనే మూల్యాంకన కేంద్రంలో రిపోర్ట్ చేయాలని, సంబంధిత అధ్యాపకులను వెంటనే రిలీవ్ చేసి విధులకు హాజరయ్యేలా చూడాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. అధ్యాపకులు గైర్హాజరైతే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా మూల్యాంకనానికి హాజరైన అధ్యాపకులకు విధుల నిర్వహణ, త్వరతగతిన పూర్తి చేయాల్సిన అంశాలపై ఆర్ఐవో సూచనిచ్చారు. కాగా సోమవారం జిల్లాలోని 14 కేంద్రాల్లో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్, మైనర్ సబ్జెక్టుల పరీక్షలకు 663మంది హాజరు కావాల్సి ఉండగా 560మంది హాజరయ్యారు. 103మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో తెలిపారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూర ు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల భద్రతలకు శక్తి యాప్ ఓ రక్షణ కవచమని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాలులో శక్తి యాప్ కరపత్రాలను ఎస్పీ ఆవిష్కరించి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌ను ప్రతి మహిళ తమ మొబైళ్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. విపత్కర పరిస్థితుల్లో ఆ యాప్‌లో వివరాలు నమోదు చేస్తే పోలీసులు వెనువెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటాని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ యాప్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించి, వారి మొబైళ్లలో డౌన్‌లోడ్ చేయించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమాజంలో వివిధ రకాల నేరాలు జరిగినప్పుడు వెంటనే శక్తి యాప్‌తోపాటు 100, 112, 1972, 1098 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కావలి డీఎస్పీలు పి.సింధుప్రియ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కల్లాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుల వినతి



కోవూరు : తహసీల్దారు నిర్మలానందబాబాకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కోవూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల సమీపంలో ధాన్యం ఆరబెట్టుకునేందుకు వీలుగా కల్లాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కమిటీ కార్యదర్శి గండవరపు శేషయ్య డిమాండు చేశారు. సీపీఎం ప్రజా చైతన్యయాత్ర సోమవారం తహసీల్దారు కార్యాలయ ఆవరణకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం ఆరబెట్టుకునే వీలులేక ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను రైతులు పొందలేక పోతున్నారని వాపోయారు. మిల్లర్లు పుట్టి ధాన్యానికి అదనంగా 30కిలోల ధాన్యం తీసుకుంటున్నారని ఆరోపించారు. సాలుచింతల నుంచి జాతీయ రహదారి వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. పీటర్స్ కెనాల్, బాపన కాలువలకు పూడికతీత పనులు చేపట్టక పోవడంతో రాత్రిళ్లు దోమలు విజృంభిస్తున్నాయని చెప్పారు. అనంతరం సమస్యలపై తహసీల్దారు నిర్మలానందబాబాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బట్టా పెద్దబ్బయ్య, అఫ్రోజ్, గండవరపు సురేష్, ఊటుకూరు రమణయ్య, చాంద్‌బాష, ఫాతిమా, చిన్నమ్మ, యజ్ఞానీ పాల్గొన్నారు.

ప్రజా చైతన్యయాత్రను జయప్రదం చేయండి

బుచ్చిరెడ్డిపాలెం (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్యయాత్రను జయప్రదం చేయా లని సీపీఎం జిల్లా నాయకుడు ముత్యాల గుర్నాథం పిలుపునిచ్చారు. సోమవారం బుచ్చి పార్కు సెంటర్లో చైతన్యయాత్రను ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యంకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని, మిల్లర్లు దళారులు కుమ్మక్కై ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తూ అన్నదాతలను దోచుకుంటు న్నారని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు మల్లికార్జున, మల్లికార్జున, రమణయ్య, శ్రీనివాసులు, సురేష్, జానీభాష పాల్గొన్నారు.



బుచ్చి : ప్రజా చైతన్యయాత్రలో పాల్గొన్న నాయకులు

మాకు న్యాయం చేయండి సారూ..

- జగనన్న గృహాల లబ్ధిదారుల నిరసన



నిరసనలో పాల్గొన్న గిరిజనులు

తోటపల్లిగూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని 23మంది గిరిజనులు సోమవారం గృహనిర్మాణ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలో తమకు ఇళ్లు మంజూరు అయ్యాయి. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అన్నం హరిప్రసాద్ ఒప్పందం చేసుకుని ఒక్కో లబ్ధిదారుల నుంచి రూ.50వేలు, కమ్మి, సిమెంటు తీసుకున్నారు. ఇప్పటివరకు గృహాలు నిర్మాణాలు కొంతవరకు చేపట్టి మొండి గోడలకే వదిలేశాడు. ఒక్క గృహానికి సుమారు రూ.1.35 నుంచి రూ.1.60లక్షల వరకు తీసుకుని నిర్మాణాలు చేపట్టలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణాలు చేపట్టాలని రెండునెలలుగా తిరుగుతున్నా కాంట్రాక్టర్ స్పందించకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వడ్డిపాళెం ప్రజలకు తీరిన దాహార్తి

కొడవలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో పాతవంగల్లు పంచాయతీలోని వడ్డిపాలెం ప్రజల నీటి సమస్యకు పరిష్కారం చూపారు. గ్రామంలోని డ్రైనేజీ పైపులు, తాగునీటి పైపులు ఒకే ప్రాంతం నుంచి వెళుతుండటంతో తాగునీటి పైపులు డ్యామేజీతో నీరు కలుషితం అవుతున్నట్లు స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సత్వరమే స్పందించి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. వారు సోమవారం డ్రైనేజీ వెళ్లేందుకు ప్రత్యేక పైపులు ఏర్పాటు చేసి, తాగునీటి పైపుల మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.



తాగునీటి పైపులు వేస్తున్న ఎక్స్‌కవేటర్

ధాన్యం కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు : జేసీ

నెల్లూరు (హరనాథపురం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జేసీ కే. కార్తీక్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఒక్కరోజే జిల్లాలో 2500మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ఎవరైనా రైతులను ప్రలోభపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తే, వారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ధాన్యం సేకరణ ఎక్కువగా ఉన్న కేంద్రాల్లో గన్నీ బ్యాగులను ముందుగా సిద్ధం చేసి ఉంచుతున్నట్లు చెప్పారు. వాహనాలకు పర్మినెంట్ జీపీఎస్ కాకుండా టెంపరరీ మాగ్నటిక్ జీపీఎస్‌ను ఏర్పాటు చేసేందుకు ఏజెన్సీని ఎంపిక చేసినట్లు చెప్పారు. దీంతో వాహనాల సమస్య పరిష్కారమవుతుందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ నెంబరు 8520879929ను ఏర్పాటు చేసినట్లు జేసీ వివరించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి అంకయ్య జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ అర్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకర పంటలు

ముత్తుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు సాగు చేయాలని ఎంఎఫ్ఎల్ రీజనల్ చీఫ్ మేనేజర్ ఆదినారాయణస్వామి పిలుపునిచ్చారు. చెన్నైకి చెందిన మద్రాసు ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం తాళ్లపూడిలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాన సదస్సులో మాట్లాడారు. రైతులు అవసరమైన మోతాదులో రసాయనిక ఎరువులు వాడాలన్నారు. భూసారాన్ని పెంచేందుకు మద్రాసు ఫర్టిలైజర్స్ తయారు చేస్తున్న విజయ ఆర్గానిక్, విజయ సిటీ కంపోస్టు, విజయ ప్రోమ్, విజయ నీమ్, తదితర ఉత్పత్తులను గురించి అవగాహన కల్పించారు. రైతులు పంట దిగుబడులు తొందరగా వచ్చేందుకు రసాయన ఎరువులు వాడకంతో భూసారం తగ్గి బీడు భూములుగా మారే ప్రమాదం ఉందన్నారు. రసాయన ఎరువులు వాడితే మట్టిని, నీటిని, గాలిని కలుషితం అవుతాయన్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతంతో పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ శివన్నారాయణ, సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త విజయకుమార్, వ్యవసాయాధికారి జోత్స్నరాణి, ఎంఎఫ్ఎల్ అడిషనల్ మేనేజర్ రాము, తాళ్లపూడి గ్రామ వ్యవసాయ సహాయ కులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదినారాయణ స్వామి

C.R.I.M.E N.E.W.S

మిద్దెపై పడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొరడా వీధిలో సోమవారం తెల్లవారుజామున ఓ యువకుడు పక్కనున్న మిద్దెపై పడి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు, పశ్చిమబంగాల్‌కి చెందిన సుబ్రత సమంత పదేళ్ల కిందట ఉపాధి కోసం నగరానికి వచ్చారు. కోటమిట్టకు చెందిన అన్వర్‌బాషా వద్ద బంగారు పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని చిన్నాన కుమారుడు సునీల్ సమంత(27) కూడా ఎనిమిదేళ్ల కిందట నెల్లూరుకి వచ్చాడు. కొరడా వీధిలోని మొహిద్దీన్ వద్ద బంగారు పని చేసుకుంటూ సమీపంలోని సురేంద్ర కాంప్లెక్స్‌లోని నాలుగోఅంతస్తులోని పెంట్‌హౌస్‌లో స్నేహితులు జయంత్‌దొట్టి, జయంత్‌గైన్‌తో కలిసి ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి వరకు ముగ్గురూ పూటుగా మద్యం సేవించారు జయంత్‌లు ఇద్దరూ భోజనం చేసేందుకు లోపలికి వెళ్లారు. సునీల్ సమంత మాత్రం బయటే ఉన్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ, పక్కనే ఉన్న మిద్దెపై సునీల్ సమంత పడ్డాడు. గట్టిగా శబ్దం రావడంతో బయటకు పరుగులు తీసిన స్నేహితులు విషయాన్ని దస్తగిరి ద్వారా సుబ్రత సమంతకు తెలియజేశారు. ఆయన అక్కడికి చేరుకొని 108కి సమాచారం అందించారు. 108సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి అన్న సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సుల్తాన్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేశారు. ప్రభుత్వ వైద్యులు సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

పూటుగా మద్యం సేవించి వ్యక్తి..



మృతి చెందిన రాఘవరెడ్డి

కలిగిరి, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి): పూటుగా మద్యం సేవించిన మేడం రాఘవరెడ్డి(58) కలిగిరి-వింజమూరు రహదారిలో సోమవారం మృతి చెందాడు.వివరాల మేరకు.. కలిగిరికి చెందిన రాఘవరెడ్డి 20 ఏళ్ల క్రితం భార్య, కుమార్తెతో విభేదించి కలిగిరి నుంచి నెల్లూరుకు వెళ్లి ఓ కార్ల షోరూం వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కలిగిరి చేరుకున్నాడు. మద్యం సేవించి బంధువుల ఇళ్ల వద్దకు వెళ్లగా వారు పంపించి వేశారు. సోమవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో వింజమూరుమార్గంలో సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన మృతి చెందిఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించి పూటుగా మద్యం సేవించి గొంతెండి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి జేబులో సెల్‌ఫోన్ ఆధారంగా స్థానిక బంధువులకు సమాచారమిచ్చి స్థానికులకు మృతదేహాన్ని అప్పగించామని ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో వృద్ధురాలిపై యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. 84ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధురాలు నివాసంలో ఒంటరిగా నిద్రిస్తుండగా గమనించిన యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో అతను పరారయ్యాడు. సోమవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు.

బీరు సీసాతో యువకుడిపై దాడి

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి):నగరంలోని డైకస్‌రోడ్డులో ఇద్దరు యువకులు మరో యువకుడిపై సోమవారం బీరు సీసాతో దాడి చేశారు. సేకరించిన సమాచారం మేరకు, నగరంలోని వెంగళరావునగర్‌కు చెందిన షారూర్(22) సోమవారం డైకాస్‌రోడ్డుకు వెళ్లాడు. అక్కడున్న మద్యం దుకాణం మీదుగా వెళుతుండగా ఆటోలో మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకులు కనిపిస్తే పలకరించవా రా... అంటూ బీరు సీసాతో అతడిపై దాడిచేశారు. గాయాలపాలైన షారూక్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. దాడిచేసిన వ్యక్తులు అదే ప్రాంతానికి చెందినవారని తెలుస్తుంది. వివరాలు తెలియాల్సి ఉంది.

తెల్లరాయి తరలిస్తున్న లారీల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న తెల్లరాయి లారీలు

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లోని 565జాతీయ రహదారిపై తెల్లరాయి తరలిస్తున్న రెండు లారీలను సోమవారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరికుంటపాడు మండలం వేంపాడు నుంచి చెన్నైలోని వేలూరుకు ఈ తెల్లరాయి తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్‌ఐ ఆదిలక్ష్మిని వివరణ కోరగా అధిక లోడుతో తెల్లరాయిని తరలిస్తుండడంతో వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు వాటిని మైనింగ్ శాఖాధికారులకు అప్పగించినట్లు ఆమె తెలిపారు.

ఏఆర్ ఏఎస్పీ వీఆర్‌కి బదిలీ

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ ఏఎస్పీ జీ. మునిరాజును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది అక్టోబరులో మునిరాజా బాధ్యతలు చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యం, వివిధ ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యి పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని గేదెల మృతి

ఉదయగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):కుర్రపల్లి బీసీ కాలనీ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై ఎస్ఎల్‌సీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని ఐదు గేదెలు, మూడు దూడలు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సీతారామపురం నుంచి హైదరాబాదుకు వెళుతున్న బస్సు అతివేగంగా వస్తూ కుర్రపల్లి బీసీ కాలనీ సమీపంలో రోడ్డు దాటుతున్న గేదెలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదు గేదెలు, మూడు దూడలు మృతిచెందాయి. బస్సు గేదెలను ఢీకొట్టి సుమారు 50 మీటర్ల మేర లాక్కొని వెళ్లడంతో రోడ్డుపై గేదల మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. మృతిచెందిన గేదెలు సీతారామపురం మండలం సంజీవరెడ్డినగర్‌కు చెందినవిగా గుర్తించారు. గేదెల మృతితో సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు పాడి రైతులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రహదారిపై గేదెల కళేబరాలు

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	218

కోడిగుడ్ల ధర (100): 510

మీటరు రీడర్ల సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు (జడ్పీ), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మీటరు రీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ కార్యదర్శి శంకర్ కిషోర్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం టౌన్, రూరల్ ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డిలకు వినతి పత్రాలు అందజేశారు. మీటరు రీడర్లకు ఖాతాల ద్వారా వేతనాలు చెల్లించాలని సీఎండీ ఆదేశాలు జారీ చేసినా, జిల్లా అధికారులు అమలు చేయడం లేదన్నారు. వెంటనే రీడర్ల వేతనాలను ఖాతాల ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బీ నవీన్, పీ కృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

నేడు విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో మంగళవారం ఉదయం 11గంటలకు విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు ప్రతిపాదించిన సీఎం చంద్రబాబుకి రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు టీడీపీ వాణిజ్య విభాగం నేతలు పేర్కొన్నారు. 44వ డివిజన్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఏడాదిలోపు అమరావతిలో 58 అడుగుల పొట్టిశ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారన్నారు. అమరజీవి 125వ జయంతి సందర్భంగా 12నెలలపాటు నెలకి ఓ కార్యక్రమం పొట్టిశ్రీరాములు పేర చేస్తామన్నారని తెలిపారు. పొట్టి శ్రీరాములు గృహంలో మ్యూజియం చేస్తామని, ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామన్నారు. అదే గ్రామంలో హైస్కూల్ భవనాన్ని పునర్నిర్మిస్తామని సీఎం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం కార్యదర్శి గ్రంధి శ్రీధర్, తెలుగు యువత అధికార ప్రతినిధి వేమా హజరత్, 44వ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జ్ వై.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

నెల్లూరు (హరనాథపురం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంలో రూ.కోట్లలో విలువ చేసే 4.5 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని ఏపీ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్‌యాదవ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ పోతిరెడ్డిపాలెంలోని స్థానిక రాజకీయ నాయకులు, అధికారులతో కలిసి ఆ భూమిని ఆక్రమించారన్నారు. కోవూరుకు చెందిన శివారెడ్డికి నిబంధనలకు విరుద్ధంగా ఆ భూమిని విక్రయించారని తెలిపారు. ఈ విషయమై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

నీటి ఎద్దడి రానివ్వొద్దు

నెల్లూరు(సిటీ), మార్చి17,(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభం అయినందున నగర ప్రజలకు దాహార్తి సమస్య రానివ్వొద్దని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజను కోరారు. సోమవారం ఎన్ఎంసీలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల తాగునీటి సరఫరాలో లోపాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఇంజనీరింగ్ విభాగం నిర్లక్ష్యం కారణంగా ఈ దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. మంత్రి నారాయణ స్వయంగా తాగునీటి ఇబ్బందులు రానివ్వద్దని ఆదేశించినా, ఇంజనీర్లలో మార్పు రావడం లేదని వాపోయారు. స్పందించిన కమిషనర్ ఇకముందు అలాంటి పరిస్థితులు రానివ్వమని స్పష్టం చేశారు. కాగా ప్లాస్టిక్ ఉత్పత్తులపై కఠినంగా వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. ముందుగా 20వ డివిజన్‌లో పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్ ఖాళీ స్థలయజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

ఏఐపై ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయి వర్క్‌షాప్

నెల్లూరు(విద్య), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం హిందీ విభాగం ఆధ్వర్యంలో భాషా బోధనలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)పై ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి మాట్లాడుతూ ఏఐ అన్ని రంగాల్లో విస్తృతంగా వ్యాపించిన నేపథ్యంలో దీనిని అందరూ విరివిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరిస్తూ నిర్వహించే వర్క్‌షాప్ విద్యార్థినులకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీ జయశంకర్‌బాబు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఆత్మారామ్ హిందీభాష అనువాదంలో ఏఐను ఎలా వినియోగించుకోవాలి, కృత్రిమ మేధ హిందీ భాష బోధనలో ఎలా ఉపయోగపడుతుందన్న అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, హిందీ అధ్యాపకులు డాక్టర్ ఎస్ సురేంద్ర, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బీదకు అభినందనలు

నెల్లూరు (జడ్పీ), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ బీద రవిచంద్రను హౌసింగ్ శాఖ అధికారులు సోమవారం కలిశారు. హౌసింగ్ శాఖ పీడీ వేణుగోపాల్, డీఈలు, ఏఈలు బీదను నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందచేశారు. ఎమ్మెల్సీగా ఎంపికైనందుకు అభినందనలు తెలియచేశారు.

పది పరుగు

● మండు వేసవిలో విద్యార్థులు, తల్లిదండ్రులకు టెన్షన్



టైం అయిపోతోంది.. పరుగో పరుగు! : నగరంలోని గుంటబడిలో విద్యార్థుల పరుగు



పరీక్ష ప్రారంభమైంది.. ఇక దూరంగా వెళ్లండి



బిడ్డలు ఎట్టారాశారో ఏందో..! : పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమ వారం మొదలయ్యాయి. అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నగరంలోని పలుచోట్ల విద్యార్థులు ఆఖరి క్షణంలో రావడంతో పరీక్ష కేంద్రాల్లో పరుగులు తీశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

\- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)







హమ్మయ్యా..! మొదటి పరీక్ష అయిపోయింది

సిటీకి సప్తగిరి బస్సులు

● త్వరలో నగరానికి టౌన్ సర్వీసులు

● తిరుపతి డిపో అధికారులతో సంప్రదింపులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆర్టీసీ సిటీ బస్సులు నడపాలని ఏళ్ల తరబడి ప్రజలు అడుగుతూనే ఉన్నారు. ఆర్టీసీ బస్సులు పెద్దవిగా ఉండటం, నగర రోడ్లు ఇరుకుగా ఉండటంతో ప్రస్తుతమున్న బస్సులను సిటీ బస్సులుగా తిప్పడం కష్టమని ఆర్టీసీ అధికారులు చెబుతూ వస్తున్నారు. నగరవాసుల కల నెరవేరేలా ఆర్టీసీ అధికారులు నూతన ప్రణాళికను సిద్ధం చేశారు. తిరుమల ఘాట్ సెక్షన్‌లో తిరిగే సప్తగిరి బస్సులను నగరానికి తీసుకు వచ్చి, వాటిని సిటీ బస్సులుగా తిప్పేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆటోలు, సిటీ బస్సుల్లో ఇరుకు, భద్రత లేని ప్రయాణంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్న మహిళలు, విద్యార్థినులు ఇక హాయిగా గమ్యస్థానాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

● బస్సుల మార్పిడి

ఇప్పటికే జిల్లా ఆర్టీసీ అధికారులు తిరుపతి రీజియన్ అధికారులతో మాట్లాడారు. సప్తగిరి బస్సులను రీజియన్‌కు పంపాలని కోరారు. సప్తగిరి బస్సుల స్థానంలో పల్లెవెలుగు బస్సులను తిరుపతి రీజియన్‌కు పంపుతామని అధికారులు సూచించారు. సప్తగిరి బస్సులు సాధారణ ఆర్టీసీ బస్సులతో పోల్చుకుంటే చిన్నవిగా ఉన్నాయి. దీంతో నగరంలోని ఇరుకు రోడ్లలోనూ వేగంగా ప్రయాణించేందుకు వీలుంటుంది. నగర ప్రధాన కూడళ్లలో పార్కింగ్‌కు కూడా పెద్దగా ఇబ్బంది ఉండదు. ఈ క్రమంలో కొద్ది రోజుల్లోనే నగరంలో ఆర్టీసీ సిటీ బస్సులు తిరగనున్నాయి.



తిరుపతి డిపోకి చెందిన సప్తగిరి బస్సు

రేపటి నుంచి త్యాగరాజ స్మరణోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యవర్గ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో తాగ్యరాజ స్మరణోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 26 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు భిక్షాటనా పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్ తెలిపారు. సోమవారం పురమందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సీతాలక్ష్మణ హనుమ సమేత శ్రీరామచంద్రమూర్తికి, త్యాగరాజస్వామికి పూజలు, ప్రత్యేక అలంకరణలు జరుగుతాయని తెలిపారు. 19 ఉదయం ఐదుగంటలకు త్యాగరాజనగర్ (వేదాయపాలెం) త్యాగరాజ స్వామి మందిరం నుంచి స్వామివార్ల విగ్రహాలను టౌనుహాలుకు తీసుకువస్తామని చెప్పారు. ఉదయం 7గంటలకు రంగనాయకులపేట వేదాంత దేశికర ఆలయం నుంచి సంగీత కీర్తనలు శ్వేతఛత్రాలతో ఊరేగింపుగా పురమందిరం వరకు వస్తామన్నారు.20 నుంచి 26 వరకు ప్రతిరోజు స్థానిక సంగీత విద్వాంసులచే కచేరీలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో అధ్యక్షుడు చతుర్వేదుల శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షులు దేవులపల్లి శ్రీరామచంద్రమూర్తి, వంజారి శ్రీనివాసమూర్తి, టీఆర్ చంద్రమౌళి, అన్నవరం సత్యనారాయణ, అవధానం రామప్రసాద్, కోశాధికారి ఎస్ నాగేశ్వర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్‌వీ మల్లికార్జున్‌రావు, జాయింట్ సెక్రటరీలు డాక్టర్ ఎస్.సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

నెల్లూరు (వైద్యం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని హంస అసోసియేషన్ నేతలు మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణకు వినతిపత్రం అందించారు. సోమవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు మంత్రిని కలిశారు, తమ సమస్యలు త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. వైద్యాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానంటూ మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హంస రాష్ట్ర అధ్యక్షులు వెంకట రమణ, కార్యదర్శి చేజెర్ల సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నారాయణతో హంస అసోసియేసన్ నాయకులు

వివాదాస్పద భూముల్లోకి ఎవరూ దిగొద్దు

కొండాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరప్పాడు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్లు 151, 166, 167, 168 లోని వివాదాస్పద భూముల్లోకి ఎవరూ వెళ్లవద్దంటూ తహసీల్దారు హెచ్చరించారు. ఈ మేరకు 145 సెక్షన్ జారీ చేశారు. దీని పై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివాదాస్పదంగా ఉన్న భూమి విషయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని మాజీ సర్పంచు చాగంటి క్రిష్ణ, గ్రామస్థులు మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు తది తరులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎస్ఐ ఎం.వెంకటరావులు చర్యలు చేపట్టారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

● నగరంలో డ్రోన్ కెమెరాల నిఘా

● ప్రతిస్టేషన్‌లోనూ ఫింగర్ ప్రింట్ డివైజర్స్

● స్పెషల్ పార్టీతో రాత్రి గస్తీ ముమ్మరం

● ప్రతిరోజూ నైట్ రౌండ్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతి భద్రతలపై జిల్లా పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వరుస హత్యలు, దొంగతనాలు, దోపిడీలు, అల్లరి మూకల ఆగడాలు జరుగుతున్న క్రమంలో నగర ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో పోలీసులు నగరంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎస్పీ జీ. కృష్ణకాంత్ నేతృత్వంలో నగర డీఎస్పీ పీ. సింధుప్రియ నేరాల నియంత్రణపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నెల నుంచి వాటిని అమలు చేస్తున్నారు.

● రాత్రిళ్లు ప్రత్యేక పార్టీలో గస్తీ

నగరంలోని ఆరుస్టేషన్‌ల పరిధిలో సిబ్బంది నైట్ బీట్ నిర్వహిస్తుంటారు. అయితే డీఎస్పీ బాధ్యతలు చేపట్టాక నైట్ బీట్ కోసం స్పెషల్ పార్టీ సిబ్బందిని కేటాయించారు. రాత్రి 9 నుంచి వారు విధుల్లో ఉంటారు. రాత్రి 11 దాటాక రోడ్లపై తిరిగే వారిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరిస్తారు.

● డ్రోన్ కెమెరాల నిఘా

నగరం ప్రస్తుతం పూర్తి స్థాయిలో డ్రోన్ కెమెరాల నిఘా నీడలో ఉంది. ఓపెన్ డ్రింకింగ్, పేకాట స్థావరాలు, గంజాయి విక్రయాలు ఇలా అనేక నేరాలను గుర్తించడంలో డ్రోన్ కెమెరాలు ప్రత్యేక పాత్ర పోషిస్తున్నాయి. ప్రతి స్టేషన్‌కు డ్రోన్ కెమెరాలను అందించడంతోపాటు వాటి పనితీరును నగర డీఎస్పీ ప్రతి రోజు ఒక్కో స్టేషన్‌కు వెళ్లి పరిశీలిస్తున్నారు. దీంతో నగరంలో ఓపెన్ డ్రింకింగ్, పేకాట స్థావరాల సంఖ్య బాగా తగ్గిందని డీఎస్పీ తెలిపారు.

● స్టేషనలన్నింటికి ఫింగర్ ప్రింట్ డివైజర్స్

నగరంలోని అన్నీ పోలీసు స్టేషన్ల అధికారులకు ఫింగర్ ప్రింట్ డివైజర్ అందుబాటులోకి తీసుకువచ్చారు. అనుమానాస్పదంగా ఉన్న వారి ఫింగర్ ప్రింట్స్ తీసుకొని పాత నేరస్థులు అయితే వారిని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. పదేపదే రాత్రి పూట బయట తిరుగుతున్న వారిని ఫింగర్ ప్రింట్స్ ద్వారా గుర్తించి వార్నింగ్‌లు ఇస్తున్నారు.

రాత్రిళ్లు నగర రోడ్లపై తిరుగుతున్న యువకులను హెచ్చరిస్తున్న డీఎస్పీ సింధుప్రియ(ఫైల్)



నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

నగరంలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతి రోజు రాత్రి 10 నుంచి 2 గంటల వరకు స్వయంగా రౌండ్స్ వేస్తున్నా. రౌడీ షీటర్లకు ప్రతి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా వారి ప్రవర్తన బట్టి రోజూ స్టేషన్‌కు రావాలని ఆదేశించాం. హాజరుకాకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో అల్లరిమూకలు, రౌడీషీటర్లు, నేరస్థులు తోక జాడిస్తే ఊరుకోం.

\- సింధుప్రియ, డీఎస్పీ

ఎట్టకేలకు ఔట్‌పోస్టు!

● జనార్దన్‌రెడ్డి కాలనీలో త్వరలో ప్రారంభం ● మంత్రి నారాయణ చొరవతో ఏర్పాటు

● ఇకనైనా నేరాలకు అడ్డుకట్ట పడేనా...?

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నిత్యం గొడవలు... అల్లరి మూకల బెదిరింపులు... చోరీలు, హత్యలతో ప్రతిరోజూ వార్తల్లో ఉండే జనార్దన్‌రెడ్డి (జేఆర్), భగత్‌సింగ్ కాలనీల ప్రజల కోసం ఎట్టకేలకు జేఆర్ కాలనీలో పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేశారు. మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ చొరవతో నవాబుపేట పోలీసులు దీన్ని ఏర్పాటు చేశారు. త్వరలో మంత్రి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించనున్నారు.



ప్రారంభానికి సిద్ధమైన పోలీసు ఔట్ పోస్టు

● అందుబాటులో పోలీసులు

నేరాలు జరిగిన సమయంలో నవాబుపేట నుంచి పోలీసులు వచ్చేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఔట్‌పోస్టు ఏర్పాటుతో 24 గంటలూ ఇక్కడ ఓ ఏఎస్ఐతో పాటు ఇద్దరు పోలీసులు మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉండనున్నారు. స్థానికులకు సమస్యలు వస్తే నవాబుపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే పనిలేకుండా ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేసేలా పోలీసుశాఖ అన్నీ ఏర్పాట్లు చేసింది. నేర తీవ్రతను బట్టి కేసును ఇక్కడే పరిష్కరించడమా...లేక నవాబుపేట స్టేషన్‌కు పంపించడమా ? నిర్ణయిస్తారు.

● నేరాలు అదుపులోకి వచ్చేనా ?

ఔట్‌పోస్టు ఏర్పాటుతో ఈ ప్రాంతంలో నేరాలు అదుపులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు. ఇటీవల జేఆర్ కాలనీ కూడలిలో ప్రయాణికులకు దారి ఇవ్వకుండా, అడ్డంగా ఆటోలు నిలిపితే, ఇదేమని అడిగితే గొడవకు దిగి, బెదిరించారు. ఔట్‌పోస్టు ఏర్పాటుతోనైనా నేరాలను కట్టడి చేయవచ్చని స్థానికులు అంటున్నారు.

ప్రసన్నుడి హుండీ లెక్కింపు

బిట్రగుంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల అనంతరం ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. గండవరం టెంపుల్ గ్రూపు ఈవో ఉమాభాయ్ పర్యవేక్షణలో కావలి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఏ లక్ష్మీనారాయణ, సిబ్బంది, సేవా సంస్థల వారు హుండీ లెక్కింపు చేశారు. భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.22,14,579 వచ్చినట్లు ఈవో తెలిపారు. గత ఏడాది బ్రహ్మోత్సవాలకన్నా ఈసారి రూ.5.74 లక్షలు అదనంగా వచ్చిందన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

నెల్లూరు (హరనాథపురం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతిలో పూర్తిగా, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఇంటర్, డిగ్రీలో ప్రవేశానికి కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉందని పేర్కొన్నారు. అక్కచెరువుపాడులో ఉన్న మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీటిల్లో ప్రవేశానికి ఏప్రిల్ 25 ఉదయం 10 నుంచి 12గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 87126 25045 నెంబరును సంప్రదించాలని కోరారు.



జగనన్న కాలనీల్లో భారీ అవినీతి



గత వైసీపీ పాలకులు జగనన్న కాలనీ పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారు. ముందుగా పేదలు, రైతుల నుంచి తక్కువ ధరకు భూముల కొనుగోళ్లకు ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి రైతుల ఖాతాలకు నగదు జమ అయిన వెంటనే వాటిని వేరే ఖాతాలకు మళ్లించారు. పక్కా ఆధారాలతో ఈ స్కాం వెనుకున్న వారిని శిక్షించ వచ్చు. శ్రీకాళహస్తిలోనూ ఇలా కుంభకోణాలకు పాల్పడ్డారు. టిడ్కో ఇళ్ల పంపిణీ కోసం కచ్చితమైన సమయాన్ని పెట్టుకోవాలి.

- బొజ్జల సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

దుగరాజపట్నం సముద్ర ముఖద్వారంపై 'మండలి'లో ప్రస్తావన



వాకాడు మండలం దుగరాజపట్నం సముద్రముఖద్వారాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. పులికాట్‌కు సంబంధించి బంగాళాఖాతంలో మూడు ముఖద్వారాలు ఉన్నాయి. వీటిలో వాకాడు మండలానికి సంబంధించి పూడిరాయిదొరవు, తూపిలిపాళెంలో ఉన్నాయి. ముఖద్వారాలు ఇసుకమేటల వల్ల సముద్రంలోకి వేటకు వెళ్లే మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం పూడిరాయిదొరవు వద్ద ముఖద్వారం పూడికతీతకు రూ.97 కోట్లు మంజూరు చేసింది. అలాగే, దుగరాజపట్నం పంచాయతీలోని సముద్ర ముఖద్వార అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే మత్స్యకార కుటుంబాలకు మేలు జరుగుతుంది.

- బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, ఎమ్మెల్సీ

'గురి' తప్పకూడదు

● ఫైరింగ్‌లో నైపుణ్యం సాధించాలన్న ఎస్పీ



గురిపెడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ఫైరింగ్ లక్ష్యం సాధించారా.. పరిశీలిస్తున్న ఎస్పీ, అధికారులు

టార్గెట్ 'గురి' తప్పకూడదు. ప్రతి పోలీసు ఫైరింగ్‌లో మంచి సుశిక్షితులు కావాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో అధికారులకు, సివిల్ పోలీస్ సిబ్బంది, ఏ.ఆర్. సిబ్బంది, అధికారులకు ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించిన వార్షిక ఫైరింగ్ రేంజ్‌లో ఎస్పీ పాల్గొన్నారు. గురిపెట్టి తూటాలు ఎలా పేల్చాలో ఎస్పీ చూపారు. ఫైరింగ్ ప్రాక్టీసులో భాగంగా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అత్యాధునిక ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసి సిబ్బందిలో ఉత్సాహాన్ని, మనోధైర్యాన్ని నింపారు. శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజల, ప్రభుత్వ ధన, ప్రాణ, రక్షణకోసం ఎల్లవేళలా సంసిద్దులుగా ఉండాలన్నారు. ఫైరింగ్‌లో పాల్గొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఫైరింగ్ రేంజ్‌లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యత వహిస్తుందన్నారు. లక్ష్యంవైపు బుల్ పడేలా తర్ఫీదు పొందాలన్నారు. జిల్లాలో వీఐపీలు, వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రముఖులకు భద్రత- రక్షణ కల్పించాలన్నా కొన్ని నెలలు శిక్షణ అవసరమని, అందులో భాగంగానే వార్షిక ఫైరింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీలు రామకృష్ణ, నాగభూషణరావు, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం)/ చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

'పది' పరీక్షలు ప్రారంభం

● తొలిరోజు 299 మంది గైర్హాజరు

- 6లో



తనిఖీ చేసి విద్యార్థులను అనుమతిస్తున్న పోలీసులు, సిబ్బంది

'మండే' సూరీడు

● తొలిసారి నాలుగు మండలాల్లో 40 డిగ్రీలకు చేరిన ఎండ

తిరుపతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలిసారిగా నాలుగు మండలాల్లో వేసవి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరాయి. సోమవారం జిల్లావ్యాప్తంగా మొత్తం తొమ్మిది మండలాల్లో ఎండలు చుర్రుమనిపించగా మూడు మండలాల్లో వడగాడ్పులు వీచాయి. చిన్నగొట్టిగల్లులో అత్యధికంగా 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా రేణిగుంటలో 40.2, చంద్రగిరి, వెంకటగిరి మండలాల్లో 40 డిగ్రీల చొప్పున ఎండలు రికార్డయ్యాయి. పిచ్చాటూరులో 39.3, ఎర్రావారిపాలెం, సూళ్ళూరుపేట మండలాల్లో 39.2, బీఎన్ కండ్రిగ, నాయుడుపేటలలో 39 వంతున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుత వేసవిలో జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరడం ఇదే తొలిసారి. చిన్నగొట్టిగల్లు, నాయుడుపేట, రేణిగుంట మండలాల్లో సోమవారం అధిక ఉష్ణోగ్రతలకు తోడు వడగాడ్పులు వీచాయి.

ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే 'ఐ గాట్ కర్మయోగి'

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యాలను, సామర్థ్యాలను, సుపరిపాలన పెంపొందించే దిశగా 'ఐ గాట్ కర్మయోగి' పోర్టల్‌లో లాగిన్ అయి సంబంధిత కోర్సులను పూర్తి చేసుకోవాలని డీఆర్వో నరసింహులు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోర్టల్‌లో నమోదు చేసుకున్న ప్రతి ఉద్యోగి మూడు కోర్సుల్లో టెస్టులు ఉత్తీర్ణులైతే మెరిట్ సర్టిఫికెట్లు, రివార్డులు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో ప్రేమ్‌చంద్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:26 (మంగళవారం సాయంత్రం)

సహర్: 4:59 (బుధవారం ఉదయం)



కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేస్తున్న ఆర్డీ మురళీకృష్ణ

పుత్తూరు మున్సిపాలిటీలో పునర్విచారణ

● పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్ ఆధ్వర్యంలో కమిటీ

● సభ్యులకు దిశా నిర్దేశం చేసిన ఆర్డీ మురళీ కృష్ణ

పుత్తూరు అర్బన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2019-24 మధ్య అవినీతిపై పునర్విచారణకు ఆర్డీ అధ్వర్యంలో కమిటీ చేరుకుంది. విచారణ కమిటీ సభ్యులకు సోమవారం ఆర్డీ దిశా నిర్దేశం చేశారు. విచారణ కమిటీలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయుడు, డీఈ పుష్పగిరి నాయక్, ఏఈ విష్ణుతో పాటు మరో క్లర్క్ ఉన్నారు. కమిటీ సభ్యులు విచారణను వేగవంతం చేస్తున్నారు. ముందుగా డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. గతంలో డంపింగ్ యార్డ్ వద్ద చేపట్టిన పనుల్లో అవినీతి జరిగిందని, ఎక్స్‌కవేటర్ అద్దె చెల్లించిట్లుగా బిల్లులు కాజేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఆ దిశగా విచారణ చేపట్టారు. అలాగే 14వ ఆర్థిక సంఘం ద్వారా చేపట్టిన పైప్ పనులను కూడా కమిటీ సభ్యులు పరిశీలించారు. కార్యాలయంలో వివిధ ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కు ఖర్చు చేసిన నిధులు, ఇతర అంశాలను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. ప్రస్తుత కమిటీలో పాత వారు ఎవరూ లేరని, అందరూ కొత్త సభ్యులని ఆర్డీ మురళీకృష్ణ వివరణ ఇచ్చారు.

25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 25వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈనెల 30వ తేదీన విశ్వవసు నామ సంవత్సర తెలుగు ఉగాదిని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆ రోజున శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసిది. అలాగే మార్చి30వ తేదీన ఆదివారం ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని సహస్రదీపాలంకార సేవ మినహా అన్ని ఆర్జితసేవలను రద్దు చేశారు. మార్చి 25తో పాటు 30వ తేదీల్లో ప్రొటోకాల్ పరిధిలోని వీఐపీలకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉంటాయి.ఈక్రమంలో 24, 29వ తేదీల్లో ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది.



యువగళం పాదయాత్రలో భాగంగా నారాయణవనం మండలానికి వచ్చిన నారా లోకేశ్‌కు చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న తంగెళ్ల సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటో)



థ్యాంక్యూ బాబూ: నగరిలో చంద్రబాబు చిత్రపటానికి మరమగ్గ, చేనేత కార్మికుల పాలాభిషేకం

'నేతన్న'ల కుటుంబాల్లో వెలుగు

● ఇళ్లకు 200.. మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు

● మంత్రి మండలి నిర్ణయంతో వేలాది మందికి లబ్ధి

మగ్గం కదలనుంది. వస్త్రాన్ని నేయనుంది. చేనేత కుటుంబంలో వెలుగులు నింపనుంది. 'నేతన్న'ల ఇళ్లకు 200 యూనిట్ల వరకు.. మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ఉమ్మడి జిల్లాలోని వేలాది చేనేత కార్మికులకు ప్రయోజనం కలగనుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మదనపల్లె, నగరి, పుత్తూరు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మరమగ్గాలు నడుస్తున్నాయి. వెంకటగిరి, నారాయణవనం, మదనపల్లె ప్రాంతాల్లో చేనేత మగ్గాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మదనపల్లె పట్టణంలో సుమారు 4వేల వరకు మరమగ్గాలు నిర్వహిస్తున్నారు. అలాగే నగరిలో 5వేలు, పుత్తూరులో 2వేలు చొప్పున ఉన్నాయి. ఈ 11వేల మరమగ్గాలకు సంబంధించి ఎక్కువ మంది యజమానులకు ఉచిత విద్యుత్తు రూపంలో ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. అదే విధంగా మదనపల్లెలో 5వేలు, వెంకటగిరిలో 2వేలు, నారాయణవనంలో 1200 చొప్పున ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ఎనిమిది వేలకు పైగా చేనేత మగ్గాలు పనిచేస్తున్నాయి. ఈ చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200 యూనిట్లు వరకు విద్యుత్తు ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడం ఆ కుటుంబాలకు ఆర్థికంగా ఊరట కలిగించనుంది. గత ఎన్నికల్లో చేనేత వర్గాలకు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్థికంగా ప్రయోజనం కలిగించే ఈ నిర్ణయం పట్ల జిల్లాలోని చేనేత కార్మికుల కుటుంబాలు, మరమగ్గాల యజమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం చేనేత రంగం కోలుకునేందుకు ఎంతగానో ఉపకరిస్తుందని ఆ వర్గాలు సంబరపడుతున్నాయి.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

చేనేతలకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ వాగ్దానాన్ని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇది ఆర్థికంగా చితికిన చేనేత కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చే అంశం. చేనేతలలో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు.

- సుంకర చిన్నరెడ్డిబాబు, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

ఉత్పత్తిని పెంచుతాం

ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్తుతో మరింత ఉత్పత్తి పెంచుతాం. గతంలో వస్త్రాలు నేయడం కన్నా కూలీ పనులకు వెళ్లవచ్చనే భావన ఉండేది. మాలో చాలా మంది ఇలాగే కూలి పనులకు వెళ్లిపోయారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్‌తో ఉత్పత్తిని పెంచుకుని కుటుంబాన్ని పోషించుకుంటాం.

- చంద్రశేఖర్, ఎగువ పద్మశాలి వీధి, నారాయణవనం

అలిపిరిలో సాధువుల ఆందోళన

బీసీవై నేత రామచంద్రయ్య యాదవ్ మద్దతు - కాలినడకన తిరుమలకు



తిరుమలలో నిరసనలు చేపట్టరాదని చెబుతున్న పోలీసులు

అలిపిరి వద్దకు చేరిన సాధువులు



తిరుపతి, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అలిపిరి సమీపంలో ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన 7స్టార్ హోటల్ నిర్మాణాన్ని వ్యతిరేకంగా సాధువులు సోమవారం ఆందోళనకు దిగారు. హోటల్‌కు ఇచ్చిన భూ కేటాయింపులు రద్దుచేయాలని, నిర్మాణాలను కూల్చివేయాలని డిమాండు చేశారు. అలిపిరిలో దీక్ష ప్రారంభించిన వీరు పాదయాత్రగా తిరుమలకు బయలుదేరుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. అలిపిరిలోని యాత్రికుల విశ్రాంత భవనం పక్కన కూర్చోబెట్టారు. ఎక్కువ సంఖ్యలో కాలినడకన వెళ్లడం వల్ల సాధారణ భక్తులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని పోలీసులు నచ్చజెప్పారు. ఇంతలో వీరికి మద్దతుగా బీసీవై పార్టీ నేత రామచంద్ర యాదవ్ తన అనుచరగణంతో అలిపిరి చేరుకున్నారు. వారితో కలసి నినాదాలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. నెయ్యి కల్తీపై ఎవరికి తోచింది వారు చెబుతున్నారని, కల్తీ జరిగిందా? లేదా? అనేదానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో గోశాలలు ఏర్పాటుచేసి, వాటినుంచి వచ్చే పాలు, నెయ్యిని మాత్రమే శ్రీవారికి వినియోగించాలని తాను కోరానన్నారు. గోవులతోపాటు 25 ఎకరాల మామిడితోటను గోశాలకు ఉచితంగా ఇస్తానని చెప్పినా వినిపించుకోలేదన్నారు. అలిపిరి వద్ద భూములు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి, ధార్మిక విరుద్ధమైన కార్యక్రమాలు మొదలుపెట్టారో, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల పవిత్రత కోసం సాధువులతో కలిసి పాదయాత్రగా కొండకు వెళుతున్నట్టు చెప్పారు. ఇంతలో తిరుమల పోలీసులు శ్రీనివాస సరస్వతితో పాటు రామచంద్రయ్య యాదవ్‌కు నోటీసులు అందజేశారు. తిరుమల కొండపై ఎలాంటి రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయకూడదని, నిరసనలకు పాల్పడరాదని, ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలిగించకూడదని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. గోవుకు పూజ చేసి నడకమార్గం ద్వారా తిరుమలకు బయలుదేరారు. కొండపైకి చేరిన వీరు పోలీసుల నోటీసులను విస్మరించారు. తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా, శ్రీవారి ఆలయం ముందు.. అఖిలాండం వద్దకు నిరసనకు కూర్చున్నారు. నినాదాలు చేశారు. పోలీసులు నచ్చచెప్పినా వినిపించుకోలేదు. చివరకు వీరందరినీ లాగి.. వాహనాల్లో తిరుపతికి, వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. వీరిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టంచేశారు. కాగా, తిరుమలలో ప్రక్షాళన జరిగే వరకు పోరాటం సాగిస్తామని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ చెప్పారు. తిరుమలలో ఈయన్ను అదుపులోని తీసుకున్న పోలీసులు భాకరాపేట స్టేషన్‌కు తరలించారు.

ఎర్రచందనం స్మగ్లర్ల వేటకు త్వరలో థర్మల్ ఇమేజింగ్ డ్రోను

టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ వెల్లడి

తిరుపతి, మంగళం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు రాత్రిపూట సైతం స్మగ్లర్లను గుర్తించటానికి వీలుగా థర్మల్ ఇమేజింగ్ డ్రోన్లను రంగంలోకి దింపనున్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు అన్నమయ్య జిల్లాలో కూంబింగ్ నిర్వహిస్తుంటే అక్కడి నుంచి తప్పించుకున్న స్మగ్లర్లు తిరుపతి జిల్లా వైపు వస్తున్నారు. ఇక్కడ కూంబింగ్ నిర్వహిస్తుంటే అన్నమయ్య జిల్లా వైపు వెళ్లి ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. దీన్ని నివారించడానికి రాత్రిపూట శేషాచల కొండలపై థర్మల్ ఇమేజింగ్ డ్రోన్లను వినియోగించడానికి ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎర్రచందనాన్ని పరిరక్షించేందుకు, స్మగ్లర్లను అరికట్టడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం శాటిలైట్ ఫోన్లు, జీపీఎస్ సిస్టం, బైనాక్యులర్స్ అందుబాటులో ఉన్నాయని, థర్మల్ ఇమేజింగ్ డ్రోన్లు కూడా వస్తే స్మగ్లర్లను పట్టుకోవడం సులభం అవుతుందన్నారు.

భారతీయ జీవనశైలిలో వేదాల అనుసరణ

● కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేద రక్షణతోనే లోక రక్షణ సాధ్యమవుతుందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో సోమవారం దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనాన్ని వర్చువల్ ద్వారా ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగే కార్యక్రమంలో శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేశారు. భారతీయ జీవన శైలి వేదాలను అనుసరించి ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచీ వేదపరిరక్షణ చర్యలు అవసరమన్నారు. జ్యోతిషం, పురాణాలు, ఇతిహాసాలు, నీతి, యోగ శాస్త్రాలను వేదాలతో అనుసంధానించాలన్నారు. వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, ఉజ్జయినిలోని సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్ఠానం కార్యదర్శి విరుపాక్ష జడ్డిపాల్‌లు మాట్లాడుతూ.. వేద పరిరక్షణ అందరి కర్తవ్యమన్నారు. మంచి జీవన విధానాన్ని అనుసరించడం ద్వారా గొప్ప ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రజల్లో ధార్మిక చైతన్యం పెరగాలన్నారు. ప్రతి ఇంట్లో వేద పారాయణం, గో సంరక్షణ చేపట్టాలన్నారు. అమలధారి సింహ సంకలనం చేసిన 'వేద కల్పవృక్ష', 'వేద మహార్నవ' అనే గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేద వర్సిటీ రిజిస్ట్రార్ భాస్కరుడు, పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.


వేద సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న విరుపాక్ష జడ్డిపాల్, చిత్రంలో వేదవర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి తదితరులు

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.46 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,721
తలనీలాలు సమర్పించినవారు: 27,261



పారని చోరుల పన్నాగం

దొంగను పట్టించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ ● పరారీలో మరో నిందితుడు



పట్టుబడిన మహ్మద్ సయ్యద్ ఇబ్రహీం - ఇంట్లో చోరీకి యత్నిస్తున్న లక్ష్మణ్

తిరుచానూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పథకం ఫలించింది. ఓ దొంగను పట్టించింది. తిరుచానూరు నుంచి నారాయణాద్రి ఆస్పత్రికి వెళ్లే మార్గంలో పీజీ గార్డెన్స్‌లో విశ్రాంత ఉద్యోగి రోశబ్బ ఉంటున్నారు. రెండు రోజుల క్రితం కుటుంబంతో వేరే ఊరికి వెళ్లారు. వెళ్లేముందు ఆయన పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఆ ఇంటికి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో సోమవారం వేకువజామున ఇద్దరు దొంగలు రోశబ్బ ఇంట్లోకి చొరబడ్డారు. వారు చోరీకి యత్నిస్తుండగా ఎల్‌హెచ్‌ఎంఎస్ పోలీసు కంట్రోల్‌రూమ్‌ను అప్రమత్తం చేసింది. దీంతో కొద్ది నిమిషాల్లోనే సీఐ సునీల్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి, బ్లూకోల్ట్ సిబ్బంది పూర్ణచంద్రరావు, శ్రీనివాసులు ఆ ఇంటికి చేరుకున్నారు. చాకచక్యంగా లోనికి ప్రవేశించారు. ఈలోగా వీరి అలికిడికి ప్రధాన నిందితుడు లక్ష్మణ్ ఇంటి వెనుక నుంచి తప్పించుకున్నాడు. అతనితో వచ్చిన సయ్యద్ ఇబ్రహీం మాత్రం పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతను తమిళనాడులోని కడలూరుకు చెందిన వాడు. లక్ష్మణ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఇతనిది తమిళనాడులోని కల్లకుర్తి. కాగా నిందితుల కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కత్తులు, రాడ్లు ఉన్నట్లు తెలిసింది. ప్రధాన నిందితుడు ఏపీ,తమిళనాడుల్లో పలు చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఊళ్లకు వెళ్తున్నపుడు ఇంటి యజమానులు సమాచారమిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ అనుసంధానం చేస్తామని పోలీసులు చెప్పారు. తాజాగా సయ్యద్ ఇబ్రహీం ఇలాగే పట్టుబడ్డాడని తెలిపారు.

శేషాచలం జీవ వైవిధ్యానికి నెలవు

బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, విజయ్‌కుమార్ తదితరులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవులు జీవ వైవిధ్యానికి నెలవు అని ఏపీ బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శేషాచలం - జీవ వైవిధ్యం అంశంపై ఎస్వీయూ సెనేట్ హాల్లో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. శేషాచలాన్ని ఓ జీవ నిధిలా అభివర్ణించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజల సహకారం అవసరమన్నారు. తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చొద్దన్నారు. చిన్ననాటి నుంచే జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. బోధన, పరిశోధనల్లోనే జీవ వైవిధ్యం పట్ల ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. శేషాచలంలో కొన్ని జీవ జాతులు అంతరిస్తున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. నగరాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు అవసరమన్నారు. డీఎఫ్‌ఓ వివేక్ మాట్లాడుతూ రాయలసీమలో నీటి వనరులున్న ఏ ప్రాంతమైనా జీవ వైవిధ్యంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిందన్నారు. శేషాచలంలో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు అటవీ శాఖ తనవంతు పాత్ర పోషిస్తోందన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు యూనివర్సిటీ తనవంతు సహకారం అందిస్తుందని తెలిపారు. తుడా కార్యదర్శి వెంకటనారాయణ, నవీన్‌కుమార్, బాలాజీ శ్రీవత్స, బీవీ రమణ, యూనివర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ నిర్మాణాల కోసం తిరుమలలో చెట్లను తొలిగించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ హరికృష్ణ పాకనాటి, అక్షర ఫౌండేషన్ అధినేత మద్దినేని హరిబాబు, బోటనీ అధ్యాపకులు డాక్టర్ కామాక్షమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుగుతూనే ఉన్నాం...

సమస్యలకు పరిష్కారం చూపండి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల వేడుకోలు ● 250 వినతుల రాక

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'సార్ వారం వారం కలెక్టరేట్‌కు వస్తూనే ఉన్నాం.. అర్జీలు ఇస్తూనే ఉన్నాం.. మా సమస్యలు పరిష్కారం కావడం లేదు' అంటూ పలువురు అర్జీదారులు అధికారుల ఎదుట వాపోయారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. మొత్తం 250 అర్జీలు అందగా అందులో 165 రెవెన్యూ శాఖకే ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ అర్జీలు స్వీకరించారు.


విద్యార్థి సంఘం నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



పింఛను కోసం తిరుగుతూనే ఉన్నా..

నాలుగేళ్ల క్రితం పక్షవాతంతో కాళ్లు చచ్చుబడిపోయాయి. కూలి పనులకు వెళ్లడానికి కూడా సాధ్యపడటం లేదు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. మూడేళ్లుగా తిరుగుతూనే ఉన్నాం. కనికరించి పింఛను వచ్చే విధంగా చూడండి.

- కోటయ్య, కాశీపురం, వాకాడు

డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల కోసం డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ లేకపోవడంతో ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. తద్వారా వారిపై ఆర్థికభారం పడుతోందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు అక్బర్, మల్లికార్జున, చిన్న, ఓంరాజ్, శివశంకర్‌నాయక్, సుందర్ పాల్గొన్నారు.

అంతర్గత పదోన్నతులు కల్పించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు ఉద్యోగులు

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలని ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఫీల్డ్ సిబ్బంది 17 ఏళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకుని వారిని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఇందులో పనిచేసే ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబానికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని, సర్వీసు వెయిటేజీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యమిత్రలు కవిత, సాదికారెడ్డి, చంద్రమ్మ, సారిక, సురేఖ, జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి


కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు

రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు డీఏ బకాయిలు చెల్లించాలని, 2023 నుంచి అమలు చేయాల్సిన 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామనాయుడు, సహాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ పెండింగ్ గ్రాట్యుటీ చెల్లింపునకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నగర ప్రధాన కార్యదర్శి వెంకటేశం శెట్టి, సభ్యులు అల్లాబక్షు, కృష్ణమూర్తి, శేఖర్, జగన్నాథనాయుడు, జయరాం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైసీపీ కోఆర్డినేటర్ అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డిపై అసత్య ప్రచారాలు చేశారని నమోదైన కేసులో వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ చరణ్‌తేజను తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు... తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చరణ్‌తేజ.. ఎమ్మెల్యే నాని, సుధారెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ తిరుపతి రూరల్‌కు చెందిన చింతకాని సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కారణంగా సోమవారం చెర్లోపల్లి-చంద్రగిరి రహదారిలోని పెట్రోలు బంకు వద్ద అతన్ని అరెస్టు చేశారు. మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఈనెల 28వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

● తొలిరోజు 299 మంది గైర్హాజరు


పరీక్షా కేంద్రం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీలు


హాల్ టిక్కెట్ నెంబర్లను చూసుకుంటూ..


పరీక్షకు ముందు తల్లిదండ్రులతో వీడియో కాల్


పరీక్షా కేంద్రం వద్ద ఓ తల్లి సెల్ఫీ


తిరుపతి అర్బన్ జీవకోనలోని విశ్వం స్కూల్ వద్ద విద్యార్థులు


తల్లిదండ్రుల ఆశీర్వాదం

తిరుపతి(విద్య), మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 164 కేంద్రాల్లో తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 299 మంది గైర్హాజరయ్యారు. 26,803కుగాను 26,504 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలి రోజు పరీక్షకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కూడా పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు.ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల 7.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాలవద్దకు రావడం మొదలుపెట్టారు. మరోవైపు నగరంలోని ఆలయాల వద్ద విద్యార్థులు మొక్కుతూ కనిపించారు. పరీక్ష ప్రారంభమైన తరువాత కూడా కేంద్రాలవద్ద నుంచి విద్యార్థులు తల్లిదండ్రులు వెళ్లకపోవడంతో కొన్ని చోట్ల పోలీసులు బలవంతంగా వారిని అక్కడినుంచి పంపించాల్సి వచ్చింది. పది పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టింది. అన్ని కేంద్రాలవద్ద గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని నాలుగు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలవద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేశాకే కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల సమీపంలో జెరాక్స్ సెంటర్లను, ఇంటర్‌నెట్ సెంటర్లను ముందుగానే మూయించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి తీసుకువెళ్లకుండా జాగ్రత్త వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పది ఫ్లయింగ్ స్క్వాడ్లు కేంద్రాలను తనిఖీ చేశాయి. 30 మంది సిట్టింగ్ స్క్వాడ్లు ఆయా కేంద్రాల్లో ఉన్నాయి. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ లాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఎన్ఎస్ఎస్ యూనిట్లకు నిధుల మంజూరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 2024-25 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో చేపట్టిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ● ఎస్వీయూ పరిధిలోని 160 ఎన్ఎస్ఎస్ యూనిట్లకు రూ.32.64లక్షలు ● పద్మావతి వర్సిటీకి రూ.3,26,400 ● ద్రవిడ వర్సిటీకి రూ.1,22,400 ● ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి రూ.3,67,200 ● ఎస్వీ వేద విశ్వవిద్యాలయానికి రూ.40,800 ● జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి రూ.61,200 ● శ్రీసిటీ ట్రిపుల్ ఐటీకి రూ.61,200 ● చిత్తూరు అపోలో యూనివర్సిటీకి రూ.40,800 మంజూరయ్యాయి.

'కుప్పం'లో ఉపాధి పనులపై విజి'లెన్స్'

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్సు అధికారులు దృష్టి పెట్టారు. ప్రాథమికంగా జిల్లా అధికారుల నుంచి రికార్డులు తెప్పించుకున్నారు. మండలాల వారీగా ఏటా ఎన్ని పనులు మంజూరయ్యాయి? ఎన్ని పూర్తి చేశారు? ఏఏ పనులకు బిల్లులు డ్రా చేశారనే కోణంలో దర్యాప్తు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. శాంతిపురం, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మండలాల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అప్పట్లో అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. వీటిపై కొందరు ఫిర్యాదులు కూడా చేసినట్లు తెలిసింది. ఓ ప్రజాప్రతినిధిపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఇష్టానుసారంగా పనులు చేసి, బిల్లులు డ్రా చేసి స్వాహా చేసినట్లు విమర్శలున్నాయి. వీటిపై విజిలెన్సు అధికారులు.. తొలుత రికార్డులను పరిశీలించనున్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో వీటిని పరిశీలించనున్నారు. ఇలా సమగ్ర దర్యాప్తునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఫిర్యాదుదారులను స్టేషన్ల చుట్టూ తిప్పితే చర్యలు

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుంటి సాకులు చెప్పి ఫిర్యాదుదారులను పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పితే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. ఒకే సమస్యపై పదే, పదే వచ్చే వారిని విచారించి సంబంధిత అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, తొమ్మిది మంది సీఐలు, సిబ్బందిని నియమించామని గుర్తు చేశారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఎక్కడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ప్రతి వారం తన దృష్టికి వస్తున్న సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 92 ఫిర్యాదులు రాగా.. దాదాపు పదింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కనుపూరు జాతరకు 250 బస్సు సర్వీసులు



సమావేశంలో తహసీల్దారు జయజయరావు, ఉత్సవ కమిటీ సభ్యులు

కోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు డిపోల నుంచి నుంచి 250 బస్సు సర్వీసులు నడపనున్నట్లు వాకాడు డిపో మేనేజరు పెంచలయ్య తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ముత్యాలమ్మ జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చిల్లకూరు దశరధరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో భక్తులకు రవాణా సౌకర్యంపై సమీక్ష జరిగింది. కోట నుంచి ముత్యాలమ్మ జాతరకు రెండు బస్సు పాయింట్‌లను నిర్ణయించారు. కోట నుంచి జాతరకు వెళ్లే బస్సులు వెంకన్నపాళెం మీదుగా వెళ్తాయి. తిరుగు ప్రయాణంలో వంజివాకం మీదుగా కోట క్రాస్‌రోడ్డుకు చేరుతాయి. అదే విధంగా వాకాడు డిపో నుంచి 30 సర్వీసులను కోట, నాయుడుపేట బస్టాండ్‌ల నుంచి నడుపుతామని డీఎం తెలిపారు. అదే విధంగా సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, నెల్లూరు డిపోల నుంచి మరో 220 బస్సు సర్వీసులను ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు నడిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఉత్సవ కమిటీ వెల్లడించింది. సమావేశంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, చిల్లకూరు దశరధరామిరెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, పెంచలయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కళాశాల స్థలంలో ఆక్రమణలను తొలగించాలి



ఆందోళన చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

నాయుడుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంలో ఆక్రమణలను తక్షణమే తొలగించాలంటూ సోమవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. డిగ్రీ కళాశాల నుంచి శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు వద్ద ఉన్న కళాశాల స్థలం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు వద్ద నిరసన తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌శర్మ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం సర్వే నెంబరు 172/1, 173/1, 2లో 6.04 ఎకరాల భూమిని కేటాయించగా ఇందులో కొంత ఆక్రమణకు గురైందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంలో ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా మరుగుదొడ్ల నిర్మాణం

కోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ మహేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మరుగుదొడ్ల నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీలకు 400 మరుగుదొడ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఇంటింటా సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

పెళ్లకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ యువరాజు తెలిపారు. సోమవారం వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఈఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్, హౌసింగ్ ఏఈ వెంకయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, ఉపాధి ఏపీవో దయానందం తదితులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

డక్కిలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రజా విజ్ఞప్తుల దినం కార్యక్రమంలో అందే అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం వివిధ సమస్యలపై 12 వినతులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, ఆర్‌ఐ ప్రియాంక, మండల సర్వేయర్ రాజగోపాల్, వీఆర్వోలు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారిణికి సత్కారం



దీపికను సత్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ

నాయుడుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల తైక్వాండో పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారిణి దీపికను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ ఉయ్యాల పవన్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభతర బోధన అందించాలి

డక్కిలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సులభ తరమైన విద్యాబోధన అందించాలని ఎంఈవో జగదీష్ బాబు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన మార్లగుంట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

26న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

నాయుడుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో ఈనెల 26న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఏబీవీపీ కన్వీనర్ తడుకు చెందు తెలిపారు. సోమవారం స్థానిక సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో కబడ్డీ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం కైవశం చేసుకున్న జట్టుకు రూ.10వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.6వేలు, తృతీయ స్థానం పొందిన జట్టుకు రూ.4వేలు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9347276012, 7095006390 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఏబీవీపీ నాయకులు మణిదీప్, గని తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు

నాయుడుపేట టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రెండు నెలలకు గాను రూ.2,27,410 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, టీడీపీ నేతలు సుబ్బారావు, నారాయణ, మల్లాం రవి, గంగాప్రసాద్, వెంకటేశ్వర్లు, మస్తాన్, సుధీర్ పాల్గొన్నారు.



హుండీ నగదు లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పెళ్లకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కగారిపేట పొలాల్లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... ముమ్మారెడ్డిగుంట గ్రామానికి చెందిన సరళ, చెంగయ్య దంపతులు తిరుచానూరులో స్థిరపడ్డారు. వారి కుమారుడు హరీష్(24) ఇటుక రాయి కోత పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ముమ్మారెడ్డిగుంటకు వచ్చిన హరీష్ కొందరితో కలిసి మద్యం తాగాడు. సోమవారం ఉదయం 8 గంటలకు అక్కగారిపేట సమీపంలో పొలాల్లో హరీష్ స్పృహతప్పి పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి 108 వాహనంలో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్‌ఐ రాఘవయ్య ఆస్పత్రి వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు.



మృతుడు హరీష్

వెనామికి వైట్‌స్పాట్ వైరస్
లక్షల్లో చనిపోతున్న రొయ్య పిల్లలు

కోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రొయ్యల సాగుకు మళ్లీ ఒడిదుడుకులు మొదలయ్యాయి. ఈ క్రాప్‌లో అయినా లాభాలు గడించవచ్చన్న రొయ్య రైతులకు చేదు అనుభవం ఎదురవుతోంది. నెల రోజుల నుంచి వాతావరణంలో మార్పుల వల్ల వెనామి రొయ్యలకు వైట్‌స్పాట్ వైరస్ సోకడంతో పిల్లలు కుప్పలు తెప్పలుగా చనిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సముద్రతీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల రైతులు కొన్నిచోట్ల క్రీక్‌వాటర్, కొన్నిచోట్ల ఉప్పునీటితో వెనామి రొయ్యల సాగు చేపట్టారు. గుంటల్లో పిల్లలను వదిలినప్పటి నుంచి ఆరోగ్యవంతంగా ఉండటంతో రొయ్యల ఉత్పత్తిపై ఆక్వా రైతులు ఆశాజనకంగా ఉన్నారు. అయితే వాతావరణంలో మార్పులు, శివరాత్రి దాటినా రాత్రి పూట మంచు తగ్గకపోవడంతో గుంటల్లో వెనామి రొయ్య పిల్లలకు వైట్‌స్పాట్ వైరస్ సోకి చనిపోతున్నాయి. ముఖ్యంగా కోట మండలంలో కొక్కుపాడు, ఉత్తమనెల్లూరు, దొరువుకట్ట, సిద్ధవరం, పుచ్చలపల్లి, గోవిందపల్లి, కొత్తపట్నం గ్రామాల్లో సాగులో ఉన్న రొయ్యలకు వైట్‌స్పాట్ ప్రబలి చనిపోతున్నాయి. 5 గ్రాముల సైజు నుంచి 40 కౌంట్ వరకు వైరస్ సోకి రొయ్యలు చనిపోతుండగా, 5 గ్రాములు పైబడిన రొయ్యలు మేత తినకుండా క్రమేణా బలహీన పడుతున్నాయి. కొన్ని పిల్లల మొప్పల దగ్గర తెల్లటిమచ్చలు ఏర్పడి మృత్యువాత పడుతున్నాయి. ఎకరం చెరువులో 2 లక్షల నుంచి 3 లక్షల వరకు రొయ్య పిల్లలు పోసి పెంచామని, ఇప్పుడు వైట్‌స్పాట్ వైరస్ సోకి చనిపోతుండటంతో రైతులు విలవిలలాడుతున్నారు.



చనిపోయిన వెనామీ రొయ్య పిల్లలు

స్వల్పంగా పెరుగుతున్న ధరలు

గత వారం కౌంట్‌పై 30నుంచి 40 రూపాయలు పడిపోయిన వెనామి రొయ్యల ధరలు ఈ వారం కౌంట్‌పై రూ.10నుంచి 15 వరకు పెరుగుతున్నాయి. ప్రస్తుతం వెనామి రొయ్యపిల్ల వంద కౌంట్ రూ.235, 90 కౌంట్ రూ.245, 80 కౌంట్ రూ.265, 70 కౌంట్ రూ.300, 60 కౌంట్ రూ.330, 50 కౌంట్ రూ.360, 40 కౌంట్ రూ.390, 30 కౌంట్ రూ.470 లెక్కన పలుకుతున్నాయి. మళ్లీ రొయ్యల పెరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుండడంతో ఆక్వా రైతుల్లో ఆశలు మొదలవుతున్నాయి.





వెంకటగిరిలో రూం నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు - సూళ్లూరుపేటలో పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల, సీఎస్ఎం, జీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, సెయింట్ మేరీస్, వివేకానంద, నారాయణ పాఠశాలతో పాటు మండలంలోని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 8 కేంద్రాల్లో 1319 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 10మంది గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ గీతాకుమారి పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు పరిచారు.

చిల్లకూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చిల్లకూరు, తిక్కవరం, వరగలి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 501 మంది విద్యార్థులకు గానూ 494 మంది పరీక్షలకు హాజరయ్యారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 1179 మంది పరీటలు రాయాల్సి ఉండగా 1164 మంది హాజరయ్యారని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

డక్కిలి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో 190 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 187 మంది హాజరైనట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని రెండు గురుకులాలు, జడ్పీ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, నారాయణ, హోలిక్రాస్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. మొత్తం 1,118 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,098 మంది హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ విధించారు.

తడ: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 286మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరయ్యారు. వాటంబేడు ఉన్నత పాఠశాలకు చెందిన 35 మందిని సూళ్లూరుపేట పరీక్షా కేంద్రానికి కేటాయించారు.

పెళ్లకూరు: మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 203మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఎంఈవో మించల శంకరయ్య తెలిపారు.

చిట్టమూరు: మండలంలో మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈవో కృష్ణయ్య తెలిపారు.

నాయుడుపేట: పట్టణంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 1384మందికి గాను 1364మంది పరీక్షలు రాశారు. 20మంది గైర్హాజరైనట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు.

ఓజిలి: మండలంలోని ఓజిలి, చిల్లమానుచేను పరీక్షా కేంద్రాల్లో 236 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఐదురుగు గైర్హాజరయ్యారు.

దొరవారిసత్రం: మండలంలోని ఏకొల్లు జడ్పీ, బీసీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. బీసీ గురుకులంలో 203 మంది, ఏకొల్లు జడ్పీ హైస్కూల్‌లో 150 పరీక్ష రాశారు.

కోట: మండలంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమ య్యాయి. మొత్తం 971మంది విద్యార్థులకు గాను 966 మంది పరీక్ష రాశారు.

చిట్టమూరు: మండలంలో మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈవో కృష్ణయ్య తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం పరిధిలోని కోటపోలూరు సబ్‌స్టేషన్‌లో సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 6నుంచి 9గంటల వరకు కోటపోలూరు, ఆబాక, సామంతమల్లాం, సర్వారెడ్డికండ్రిగ, మినుమలమూడి, చందనమూడి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పూర్ణిమ తెలిపారు.

20న ద్విచక్రవాహనం వేలం

వాకాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వాకాడు సర్కిల్ పరిధిలో ఒక కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని ఈనెల 20వ తేదీన వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

పరీక్షా కేంద్రం వద్ద మురుగు
దుర్గంధంతో విద్యార్థుల ఇక్కట్లు



పాఠశాల గేటు పక్కన నిల్వ చేరిన మురుగునీరు

సూళ్లూరుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద పరీక్షా కేంద్రం గేటు వద్ద మురుగు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణ నడిబొడ్డులో జీఎస్‌టీ రోడ్డు పక్కన జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఉంది. రోడ్డు పక్కన కాలువలో మురుగునీరంతా పాఠశాల ప్రవేశ ద్వారం వద్దకు వచ్చి ఆగిపోతోంది. సోమవారం పదో తరగతి రాయడానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గేటు ముందు నిరీక్షించడానికి దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి కాలువలో మురుగునీరు నిల్వ చేరకుడా తొలగించాల్సిన అవసరం ఉంది.

ఎమ్మెల్యే చొరవతో బస్సు సర్వీసులు పునఃప్రారంభం

వాకాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఆర్టీసీ డిపో పరిధిలో కొంత కాలంగా ఆపేసిన బస్సు సర్వీసులను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చొరవతో పునఃప్రారంభించారు. సోమవారం ఎన్‌ఎంయూఏ నాయకులు పాశిం సునీల్‌కుమార్‌ను కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ నాయకులు మాట్లాడుతూ టీపీసీల పేరుతో వాకాడు డిపో పరిధిలో 8 ఎక్స్‌ప్రెస్ సర్వీసులను గత కొంతకాలంగా నిలుపుదల చేయడంతో సంస్థకు భారీ నష్టం వచ్చేదన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి సోమవారం నుంచి అన్ని బస్సు సర్వీసులు ప్రారంభించడం హర్షణీమన్నారు.

భూములపై హక్కులు కల్పించండి

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని అంకులపాటూరు, తిక్కవరం, ఉడతావారిపార్లపల్లి గ్రామాల ప్రజలు గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలమైన తాము అంకులపాటూరు గ్రామ పరిధిలో సుమారు 40 ఎకరాల భూమిని 20 ఏళ్లకు పైగా సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ భూములను ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ భూములపై తమకు హక్కులను కల్పించాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ బీదకు ఎమ్మెల్యేల అభినందన



రిటర్నింగ్ అధికారిణి వనితారాణి నుంచి ఎమ్మెల్సీగా ధృవీకరణ పత్రం అందుకుంటున్న రవిచంద్ర, పక్కన ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల కోటాలో శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సోమవారం అమరావతిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి వనితారాణి నుంచి డిక్లరేషన్ ఫాం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పాశిం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు బీద రవిచంద్రకు అభినందనలు తెలిపారు.

మూడంతస్తుల భవనం నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మూడంతస్తుల భవనం నుంచి పడిపోయిన మహిళకు తీవ్రగాయాలైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం మేరకు... పుత్తూరు ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి భర్తతో కలిసి నాయుడుపేట పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో నివాసం ఉంటోంది. సోమవారం బట్టలు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు మూడవ అంతస్తు నుంచి కింద పడిపోయింది. తీవ్ర గాయాలపాలైన విజయలక్ష్మిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం తిరుపతికి తీసుకెళ్లారు.

పంటకాలువ పరిశీలన

నాయుడుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది వద్ద ప్రారంభమయ్యే విన్నమాల పంటకాలువను సోమవారం మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పరిశీలించారు. కాలువలో పూడికతీసి పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటామన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

చిల్లకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడూరు, నెలబల్లిరెట్టపల్లి గ్రామాల్లో సోమవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల లీలావతి, డాక్టర్ షాలోమ్ అరాఫత్, చిట్టేటి శ్రీనివాసులు, రవికుమార్, మునిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అళఘునాథస్వామి గ్రామోత్సవం

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అళఘునాథస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై అలంకరించి భక్తుల గోవింద నామస్మరణల నడుమ గ్రామోత్సవం జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సూర్యప్రభ వాహనంపై అళఘునాథస్వామి

రైల్లో నుంచి జారిపడి గుంటూరువాసి మృతి



మృతిచెందిన శ్రీనివాసులు

చిల్లకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారిపడి గుంటూరుకు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం స్థానిక శంకరన్ గిరిజన కాలనీ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చోటుచేసు కుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు... గుంటూరుకు చెందిన శ్రీనివా సులు(45) విజయవాడ నుంచి చెన్నైకి రైలులో ప్రయాణిస్తూ చిల్లకూరు వద్ద శంకరన్ గిరిజనకాలనీ సమీపంలోని రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. సమీప పొలాల్లోకి వెళుతున్న స్థానికులు గాయపడిన శ్రీనివాసులును గుర్తించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓవర్‌టేక్ చేయబోయి లారీని ఢీకొన్న కారు
ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



కారులో ఇరుక్కుపోయిన సేగ్గీ ప్రవీణ్ మృతదేహం - గాయపడ్డ సోయబ్, చైతన్య, ప్రశాంత్

తడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయిన కారు లారీని ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. గూడూరుకు చెందిన సోయబ్, చైతన్య ప్రశాంత్, సేగ్గీ ప్రవీణ్ సోమవారం రాత్రి కారులో చెన్నైకు బయలుదేరారు. తడ మండలం పూడికుప్పం జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఎడమ వైపు ఓవర్ టేక్ చేయబోయారు. అదే సమయంలో లారీ ఒక్కసారిగా ఎడమ వైపునకు రావడంతో వెనుక నుంచి వేగంగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ప్రవీణ్(25) స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న సోయబ్, చైతన్య ప్రశాంత్‌కు గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్ సాయంతో కారులో ఇరుక్కుపోయిన ప్రవీణ్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా: నలుగురికి గాయాలు



బోల్తాపడిన కారు

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురిటిపాళెం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం ఓ కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు వివరాలు... హైదరాబాదు లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న జ్యోతి, మహేష్, ఛాయాశ్రీ, అనూష తిరుమలకు కారులో బయలుదేరారు. పురిటిపాళెం జాతీయ రహదారి సమీపంలో వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు కావడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.